


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 21-06-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 245 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు గుర్తింపు

- 2022 నాటికి భారత్‌లో జీ-20 సదస్సు
- ఉగ్ర నిర్మూలనలో భారత్‌కు అన్ని దేశాల అండ
- పార్లమెంట్ ఉభయ సభల్లో రాష్ట్రపతి రామ్‌నాథ్



హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అన్నారు. విదేశాలతో మన సంబంధాలు మరింత బలపడ్డాయన్నారు. ఈ నేపథ్యంలోనే 2022లో భారత్ జీ-20 సదస్సును నిర్వహించనున్నట్లు రామ్‌నాథ్ చెప్పారు. గురువారం పార్లమెంట్‌లో ఉభయసభలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఉగ్రవాదం అంశంలో ప్రపంచ దేశాలు అన్నీ భారత్‌కు అండగా ఉన్నాయన్నారు. పాక్‌లో ఉన్న మసూద్ అజర్‌ను ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ ఉగ్ర వాదిగా గుర్తించిందన్నారు. విదేశాల్లో సెటిల్ అయిన భారతీయుల రక్షణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విదేశాల్లో ఇబ్బందిపడుతున్న వారిని శరవేగంగా ఆదుకుంటు న్నారన్నారు. పాస్‌పోర్ట్, వీసా సర్వీసులను వేగవంతం చేశామన్నారు. అక్రమంగా భారత్‌లోకి చొరబడుతున్న విదేశీయులతో అంతర్గత భద్రత ముప్పుగా మారిందన్నారు. నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ విధానాన్ని ప్రాధాన్యతా అవసరాన్ని బట్టి నిర్వహించనున్నట్లు చెప్పారు.

### ఏపీ వరప్రదాయిని పోలవరంపై జగన్ దృష్టి

# ఎందుకు ఆలస్యమైంది?

- విహంగవీక్షణం ద్వారా సందర్శన
- కాఫర్ డ్యాం నిర్మాణ పనుల పరిశీలన
- పునాదుల్లోనే పోలవరం ఎందుకు ఉంది?
- షెడ్యూల్ ప్రకారం నిర్మాణం ఎందుకు పూర్తి చేయలేదు?
- భారీగా వరద వస్తే పరిస్థితి ఏమిటి?
- నిర్వాసితులకు పరిహారం ఎప్పుడు చెల్లిస్తారు?
- పోలవరం పనులపై నిపుణుల ద్వారా ఆడిటింగ్..





పోలవరం: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సారిగా పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. అమరావతి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో పోలవరం చేరుకున్న సీఎం .. మూడు సార్లు విహంగ వీక్షణం ద్వారా ప్రాజెక్టు ప్రాంతాన్ని, ఎగువ, దిగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణాలను పరిశీలించారు. హెలికాప్టర్ దిగిన తర్వాత జగన్‌కు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వ్యూ పాయింట్‌కు చేరుకుని ప్రాజెక్టును పరిశీ లించారు. అధికారుల నుంచి తరువాయి 2లో..

### తెలంగాణ జలప్రదాయిని..

# నేడే కాళేశ్వరం ప్రారంభోత్సవం

- ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్..
- ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- ముఖ్య అతిధులుగా నరసింహన్, జగన్, ఫడ్నవీస్

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా తెలంగాణ ప్రభుత్వం చెబుతోన్న విషయం తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను శుక్రవారం (జూన్ 21న) ప్రారంభిస్తున్నారు. కాళేశ్వరం ప్రారంభోత్సవ సంబురాలను తెలంగాణ ప్రభుత్వం ధూంధాంగా జరపడానికి ఇప్పటికే అన్నీ సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చేతుల మీదుగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తారు. ఏపీ సీఎం వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గవర్నర్ నరసింహన్ అతిథులుగా హాజరవుతారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా ఊరూరా పెద్దఎత్తున ఉత్సవాలు జరగాలని, ఊళ్లలో పటాకులు పేల్చి మిఠాయిలు పంచాలని.. ఊరేగింపులు, ర్యాలీలు తీయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. తరువాయి 2లో..

### యోగా సాధనలో అత్యంత పొట్టి మహిళ



వార్త 8వ పేజీలో..

## టీడీపీకి భారీ షాక్

- టీడీపీలో అంతర్గత సంక్షోభం
- రాజ్యసభలో టీడీఎల్పీ బీజేపీలో విలీనం
- అదే బాటలో 20 మంది మాజీ ఎమ్మెల్యేలు!

న్యూఢిల్లీ : మూలిగే నక్క మీద తాటికాయ పడిన చందంగా మారింది తెలుగుదేశం పార్టీ పరిస్థితి. ఎన్నికల్లో ఘోర పరాభవం నుంచి తేరుకోకముందే ఆ పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. టీడీపీకి చెందిన నలుగురు రాజ్యసభ ఎంపీలు ఆ పార్టీని వీడారు. రాజ్యసభ సభ్యులు ఎంపీలు సుజనా సుజనా చౌదరి, సీఎం రమేష్, టీజీ వెంకటేశ్, గరికపాటి మోహనరావు బీజేపీలో చేరనున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా సమక్షంలో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును కలిశారు. ఈ సందర్భంగా రాజ్యసభలో తమను ప్రత్యేక బృందంగా గుర్తించాలని ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నలుగురి సంతకాలతో కూడిన లేఖను రాజ్యసభ చైర్మన్‌కు అందజేశారు. జాతి ప్రయోజనాల కోసం ప్రధాని నరేంద్ర మోదీ







అనుసరిస్తున్న విధానాలు తమను ఆకర్షించాయని లేఖలో పేర్కొన్నారు. ఈ కారణంగా ఆయన నాయకత్వంలో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ 4 వ పేరాగ్రాఫ్‌లో పేర్కొన్న అంశాలను అనుసరించి తమ పార్టీ సభాపక్షాన్ని బీజేపీలో విలీనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీకి ఇక ఇద్దరు రాజ్యసభ సభ్యులు తరువాయి 2లో..




# హామీలన్నీ అమలు పరుస్తాం

- క్షేత్ర స్థాయిలో అమలుకు అధికారులు సహకరించాలి
- రాగ ద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహించండి
- కష్టపడిపనిచేసే వారిని ప్రోత్సహిస్తాం
- అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదు
- పర్యాటక మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖపట్నం: ఎన్నికల మేనిఫెస్టోని తమ ప్రభుత్వం ఒక పవిత్ర గ్రంథంగా భావిస్తుందని, అందులో ఇచ్చిన హామీలను అన్నింటినీ క్షేత్ర స్థాయిలో పటిష్టంగా అమలు పర్చేందుకు జిల్లా అధికారులు అందరూ సహకరించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు తరువాయి 6లో..

### గిరిజన శాఖమంత్రిగా

## పుష్పశ్రీవాణి బాధ్యతలు

- ఆరోగ్య కార్యకర్తల వేతనాల పెంపు
- మార్కెట్ యార్డుల అభివృద్ధి
- గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తా



వార్త 2వ పేజీలో..



# సంపూర్ణ ఆరోగ్యానికి యోగ దోహదం






ములగాడ: సంపూర్ణ శరీరక మానసిక ఉద్రేక పరమైన సాంఘిక పరమైన ఆరోగ్యానికి యోగ ఎంతగానో దోహద పడుతుందని సెయిశీట్ ఆన్స్ నర్సింగ్ కళాశాల సీనియర్ అధ్యాపకురాలు మరియు యోగా టీచర్ సిస్టర్ రెజి ధామస్ అన్నారు స్థానిక మల్కా పురం సెయింట్ ఆన్స్ డిగ్రీ మరియు జూనియర్ కళాశాలలో గురువారం యోగా తరగతులను సిస్టర్ రెజి ధామస్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యోగా వల్ల సానుకూల దృక్పదం పెరుగుతుందని వత్తిడి తగ్గుతుందని అన్నారు. శరీరానికి స్నానం ఎంత అవసరమో మనసుకు కూడా యోగా అంత అవసరమని ఆమె అన్నారు అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమ అ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన జీవితానికి యోగా ప్రార్ధన ఎంతో అవసరమని అదేవిధంగా శరీర ఆకృతికి మానసిక దృఢత్వానికి యోగ అవసరమని అన్నారు తరగతిలో మరో నాలుగు రోజులు కొనసాగుతాయని ప్రతి ఒక్క విద్యార్థులు కూడా ప్రతిరోజు యోగా చేసి వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని యోగ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా సిస్టర్ రెజి ధామస్ ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ పి ఎస్ భాగ్యలక్ష్మి ఇతర కళాశాల ప్రోగ్రాం అధికారు అనసూయదేవి, ఏ ఆదిలక్ష్మి, వైజెస్సి డి.నాగమణి అధ్యాపకులు జాతీయ సేవా పథకం కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పురపాలక పాఠశాలల్లో ప్రైవేట్‌కు ధీటైన బోధన ఉండాలి

**- అసిస్టెంట్ కమిషనర్ కనకమహాలక్ష్మి**



విజయనగరం : పట్టణంలోని అన్ని పురపాలక పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పిస్తూ ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నామని అసిస్టెంట్ కమిషనర్ కనకమహాలక్ష్మి అన్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కూడా సహకారం అందిస్తే అద్భుతాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. బుధవారం సాయంత్రం పురపాలక సమావేశ మందిరంలో పురపాలక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ కనక మహాలక్ష్మి మాట్లాడుతూ పురపాలక పాఠశాలల్లో సాధిస్తున్న ఉత్తమ ఫలితాలతో పురపాలక పాఠశాలల పట్ల ప్రజలకు నమ్మకం ఏర్పడిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసినప్పుడే అందరిలో మంచి గుర్తింపు పొందుతారన్నారు. ప్రతీఒక్కరూ ఉపాధ్యాయ వృత్తిని ఎంతో పవిత్రంగా భావించి విధులు నిర్వహించాలన్నారు. పాఠశాలలకు ప్రభుత్వం అన్ని మౌళిక సదుపాయాలు కల్పిస్తుందని, ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచి వారి ఉన్నతికి తోడ్పడాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు పాఠాలు బోధించడంలో ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. విద్యార్థులకు సమాజంపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు వృత్తిధర్మం నిబద్ధతతో వ్యవహరించాలని, చాలా మంది వారి పనితీరు మెరుగుపర్చుకోవాల్సి ఉందన్నారు. బోధనా సామర్థ్యం ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూ విద్యార్థులను బహుముఖ ప్రజ్ఞావంతులుగా తయారు చేసేందుకు ఉపాధ్యాయులు దృష్టిసారించాలన్నారు. పురపాలక పాఠశాలల్లో పేద, మధ్యతరగతికి చెందిన పిల్లలే ఎక్కువగా చేరుతారని, వీరు ఫలితాల్లో కాస్త వెనుకంజలో ఉంటున్నారని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు పురపాలక శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఇప్పటికే 10వ తరగతిలో 10/10 పాయింట్లు, ఉత్తీర్ణతా శాతంలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామన్నారు. చదువులే కాకుండా పురవిద్యార్థులను సాంకేతికంగా, ప్రతిభా, క్రీడారంగాల్లోనూ రాణించేలా తీర్చిదిద్దేందుకు వినూత్న కార్యక్రమాలతో కార్పొరేట్‌స్థాయిలో సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. భవనాలకు సంబంధించి రిపేర్లను ఉన్నతాధికారుల అనుమతితో పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులందరూ టైంటేబుల్ ప్రకారం క్లాసులు నిర్వహించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా 986 అడ్మిషన్ల జరిగాయని, ఆ సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. పురపాలక పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు గురించి తల్లిదండ్రులకు, విద్యార్థులకు వివరించి అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో పురపాలక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రీడాకారులకు దుస్తులు, పరికరాలు పంపిణీ



విజయనగరం: ది గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం చారిటబుల్ పౌండేషన్ దాతృత్వం వారోత్సవాల్లో భాగంగా గత మూడు రోజులలుగా వివిధ వర్గాలకు దాతృత్వంగా అనేక వస్తువులను పంపిణీ చేసింది. అందులో భాగంగాస్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో 20 మంది కబడ్డీ,వాలీబాల్ క్రీడాకారులకు క్రీడాసామగ్రిని అందించింది. రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ తైక్వాండో ఛాంపియన్ వేణుగోపాల్ చేతులమీదుగా ఈ పరికరాలు అందించారు. పౌండేషన్ అధ్యక్షురాలు రాధిక మంగిపూడి ఈ సందర్భంగా మాట్లాడుతూ వేలాదిరూపాయల వ్యయంతో క్రీడాకారులకు ఈ పరికరాలు, అలాగే క్రీడా దుస్తులు అందించి వారిలో సృజనాత్యకతను ప్రోత్సహించాలన్న తలంపునకు పలువురు సహాయ సహకారాలు అందిస్తున్నారిన కృతజ్ఞతలు తెలిపారు.

## చినుకుపడితే రోడ్డుపైకి మురికి నీళ్ళు



పరవాడ: మండల కేంద్రమైన పరవాడలో చినుకుపడితే కాలువలో వున్న మురికి నీరు అంతా రోడ్డు మీద దర్శనము ఇస్తుంది. కాలువల్లో వున్న చెత్తను తీయకపోవడము వలన వర్షంపడినప్పుడు మురికినీరు అంతా రోడ్డు మీద ప్రవహిస్తుందని స్థానికులు అంటున్నారు. రోడ్డు మీద ప్రయాణించే వాహనదార్లు అదుపుతప్పి పడుపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువల్లో చెత్తను తీసివేయాలని స్థానిక పజలు కోరుతున్నారు.

# అధికారులు ప్రజాసేవకు అంకితం కావాలి : ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం : నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు నియమ నిబంధనలు అనుసరించి ప్రజలు సేవలు అందించాలని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశం హాలునందు ఎంపీపీ గుడాల రమేష్ అధ్యక్షతన మండలస్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో శాసనసభ్యులు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ మండలస్థాయి అధికారులు వారి శాఖలకు సంబంధించిన పనులను నియమ నిబంధనలకు లోబడి ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. గత 5 సంవత్సరాల అభివృద్ధి ద్వారా తిరిగి శాసనసభ్యుడిగా ప్రజలు ఎన్నుకున్నారని, అదేవిధంగా నియోజకవర్గ అభివృద్ధిలో శాసనసభ్యుడిగా ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. ముఖ్యంగా గత 5 సంవత్సరాలలో అనేక అభివృద్ధి పనులు నియోజకవర్గంలో చేపట్టామని, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేసి ప్రారంభించడానికి అధికారులు కృషి చేయాలని తెలిపారు. త్వరలో ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాలు ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసిన నాటికి బిల్లులకు సంబంధించిన సొమ్ము త్వరగా వచ్చేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. అభివృద్ధి పనులకు మంజూరు చేసిన రూ.50కోట్లు మిగిలి ఉన్నాయని, వీటికి ప్రభుత్వ మంజూరు ఉత్తర్వులు వస్తే పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనదని, గ్రామాల్లో శానిటేషన్, మంచినీరు పరిశుభ్రతకు పంచాయితీ సెక్రటరీలు కృషి చేయాలని తెలిపారు. ఇక నుంచి నియోజకవర్గంలో తరుచు పట్టణాలు, గ్రామాలు, స్కూల్స్, అంగన్వాడీ కేంద్రాలు, వసతి గృహాలలో శానిటేషన్, తాగునీరుపై తనిఖీ చేస్తానని తెలిపారు. బెల్టుషాపులు మూసివేతలోను, సారాను అరికట్టడంలోను ఎక్సయిజ్ అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందరం సమన్వయంతో ప్రజలకు సేవలు అందించాలని కోరారు.





అనంతరం మండల స్థాయిలో వివిధ శాఖలైన వ్యవసాయ, ఆరోగ్య, లేబర్, ఐసిడిఎస్, రెవెన్యూ, పంచాయితీ రాజ్, ఇరిగేషన్, ఆర్& బి, ఎస్ఆర్ఇజిఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎక్సయిజ్, హౌసింగ్, వెటర్నరీ, ఎలక్ట్రికల్, మండల పరిషత్, వివిధ శాఖకలు సంబంధించిన అధికారులతో శాసనసభ్యులు పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం శాసనసభ్యుడుగా రెండవసారి గెలుపొందిన నిమ్మకాయల చినరాజప్పను ఎంపీపీ గుడాల రమేష్, స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జునరావు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, తహశీల్దార్ కె.గోపాలకృష్ణ సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, మండల స్థాయి అధికారులు, పంచాయితీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## ఏపీ వరప్రదాయిని పోలవరంపై జగన్ దృష్టి

వివరాలు అడిగి తెలుసుకున్నారు. నదీగర్భంలో నిర్మిస్తున్న కాఫర్‌డ్యామ్‌కు సంబంధించి ప్రధానంగా సీఎం ప్రశ్నలు లేవనెత్తారు. ఎగువ కాఫర్ డ్యామ్ పనులు ఎంత వరకు పూర్తయ్యాయి? భారీగా వరద వస్తే పరిస్థితి ఏంటి? ఇది కొట్టుకు పోకుండా తీసుకున్న రక్షణ చర్యలు ఏమిటి? గోదావరిలో వరద వస్తుందని తెలిసీ సీజన్ ముగిశాక ఎలా నిర్మాణం చేపట్టారని అధికారులను ప్రశ్నించారు. కాఫర్ డ్యామ్ కారణంగా నీరు స్పిల్‌వేపైకి వచ్చి నిర్మాణాలకు ఆటంకం కలిగితే ఎలా అని సందేహం వ్యక్తం చేశారు. సీఎం అడిగిన ప్రశ్నలన్నింటికీ అధికారులు వివరణ ఇచ్చారు. షెడ్యూల్ ప్రకారం దీని నిర్మాణం ఎందుకు పూర్తి చేయలేకపోయారని అధికారులను అడిగితెలుసుకున్నారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లించే విషయంపై పరిశీలన జరపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పోలవరం పనులపై నిపుణుల కమిటీతో ఆడిటింగ్ నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. ఆ తర్వాత ప్రాజెక్టు సమీపంలో అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నిర్వాసితులకు పరిహారం పెంపు విషయాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నాలుగు నెలల్లో ఏయే పనులు చేయగలరంటూ అధికారులను ముఖ్యమంత్రి ప్రశ్నించగా, స్పిన్ ఛానెల్ ఏటిగట్లను పటిష్టపరుస్తామని తెలిపారు. ఇక డ్యామ్ పూర్తయిన పది నెలలలోపు హైడ్రాలిక్ పవర్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని ఈ సమావేశంలో కాంట్రాక్టర్లు ముఖ్యమంత్రికి తెలిపారు. 2021 ఫిబ్రవరి నాటికి ప్రధాన జలాశయాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

పునాదుల్లోనే పోలవరం ఎందుకు ఉంది?

2018 నాటికి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చిన టీడీపీ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేకపోయింది. 2018 నాటికి గ్రావిటీతో నీరు ఇస్తాం రాసుకోమంటూ అప్పటి జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా అసెంబ్లీలో వెటకారంగా మాట్లాడిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటి వరకూ ప్రాజెక్టు పూర్తి కాలేదు. నిర్వాసితులను పూర్తిస్థాయిలో తరలించి, ప్రాజెక్టు ఆయకట్టుకు నీరు ఇవ్వగలిగితేనే ప్రాజెక్టు పూర్తయినట్లు. లక్షా ఐదు వేల కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉండగా, ఇప్పటి వరకూ మూడు వేల కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు.

సీఎంతో పాటు ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, రాష్ట్రమంత్రులు అనిల్ కుమార్ యాదవ్, పిల్లి సుభాష్ చంద్రబోస్, పి.విశ్వరూప్ పలువురు ఎమ్మెల్యేలు పర్యటనలో పాల్గొన్నారు.

## నేడే కాళేశ్వరం ప్రారంభోత్సవం

భద్రత, వసతులు, ఇతర కారణాల వల్ల ఎక్కువమందిని ఆహ్వానించలేకపోతున్నామని.. ఊళ్లల్లోనే ఉండి పార్టీ నాయకులు, ప్రజలు ప్రారంభోత్సవాలను తిలకించాలని సూచించారు.

ఇదిలా ఉంటే, కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అనడంపై కొంత మంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది నిజంగా ప్రపంచంలోనే పెద్దదా అని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వారికి లెక్కలు, కొలతలతో సహా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివరణ ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఒక ట్వీట్ చేశారు. మొత్తం 3 బ్యారేజీలు, 1531 కి.మీ. గ్రావిటీ కెనాల్స్, 203 కి.మీ. టన్నెల్స్, 20 లిఫ్ట్‌లు, 19 పంపు హౌస్‌లు, 20 రిజర్వాయర్లలతో మొత్తం 37 లక్షల ఎకరాలకు 147 టీఎంసీల సాగునీటిని అందించే కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఇప్పటి వరకు ప్రపంచంలో అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లుగా యూస్‌లోని కొలొరాడో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, ఈజిప్ట్‌లోని అతిపెద్ద మానవ నిర్మిత నది మాత్రమే ఉన్నాయని, ఇప్పుడు వాటిని కాళేశ్వరం ప్రాజెక్ట్ అధిగమించిందని ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ నిర్మాణ సంస్థ మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (MEIL) వెల్లడించింది. ఇప్పుడు ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన లెక్కలను కేటీఆర్ స్పష్టంగా తెలియజేశారు.

## టీడీపీకి భారీ షాక్


మాత్రమే మిగిలారు. కాగా విజయవాడ ఎంపీ కేశినేని కూడా టీడీపీని వీడి బీజేపీలో చేరతారని ఢిల్లీ వర్గాల సమాచారం. ఇదిలా ఉండగా... తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో టీడీపీ కాపు నేతలు రహస్యంగా సమావేశమైన సంగతి తెలిసిందే. దాదాపు 20 మంది మాజీ ఎమ్మెల్యేలు ఈ భేటీలో పాల్గొన్నారు. అయితే పార్టీ ఓటమికి గల కారణాలను సమీక్షించేందుకే సమావేశమయ్యామని వారు చెబుతున్నా.. పార్టీలో అంతర్గత సంక్షోభానికి ఇది నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అదే విధంగా చంద్రబాబు సూచనల మేరకే తాజా పరిణామాలు చోటుచేసుకుంటున్నాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## గిరిజన శాఖమంత్రిగా పుష్పశ్రీవాణి బాధ్యతలు

అమరావతి : గిరిజన శాఖ మంత్రిగా డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె ....గిరిజన గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తల వేతనాలను రూ.400 నుంచి రూ.4వేలకు పెంచుతూ తొలి సంతకం చేశారు. గిరిజన ప్రాంతాల్లో మార్కెట్ యార్డుల అభివృద్ధికి రూ.19 కోట్లు విడుదల చేస్తూ ఆమె రెండో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'గిరిజన సంక్షేమ శాఖ లో పారదర్శక పాలన అందించి, సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నమ్మకాన్ని నిలబెట్టుకుంటా' అన్నారు. గిరిజనులకి ఇచ్చిన ప్రతి ప్రభుత్వ పథకాన్ని, హామీని నెరవేర్చి గిరిజనుల ఆత్మ గౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తామన్నారు. గిరిజన ప్రాంతంలో విద్యావకాశాలు మెరుగుపరిచి, గిరిజన ఆడపిల్లలకి వైఎస్సార్ పెళ్లికానుక కింద లక్ష రూపాయలు అందిస్తామన్నారు. గతంలో చంద్రబాబు గిరిజనులని అంటరాని వారిగా చూసి మంత్రి పదవి ఇవ్వలేదని, గిరిజనులని ఉప ముఖ్యమంత్రి చేసిన జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యేలు కోలగట్ల, భాగ్యలక్ష్మి, జోగరావు పాల్గొన్నారు.

# ఐఎంఏ జువెల్స్‌లో సిట్ సోదాలు




బెంగళూరు : డిపాజిట్‌లకు అధిక వడ్డీలు చెల్లిస్తామంటూ మోసం చేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐ మోనిటరీ అడ్వైజరీ(ఐఎంఏ) జువెల్స్‌లో సిట్ అధికారులు విచారణ చేపట్టారు. కర్ణాటలోని శివాజీ నగర్‌లో ఉన్న ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో సిట్ అధికారులు సోదాలు చేస్తున్నారు. అధిక వడ్డీ చెల్లిస్తామని చెప్పి, పెట్టుబడిదారుల నుంచి పెద్ద మొత్తంలో నగదు కాజేశారంటూ ఐఎంఏ సంస్థపై ఆరోపణలున్నాయి. ఈ కేసుకు సంబంధించి ఐఎంఏ జెవెల్స్ ఆడిటర్ ఇక్బాల్‌ఖాన్‌ను సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఫ్రేజర్ టౌన్‌లో నివాసముంటున్న ఇక్బాల్ చాలాకాలంగా ఐఎంఏకు ఆడిటర్‌గా పనిచేస్తున్నాడు. ముస్లిం మహిళలకు మాయమాటలు చెప్పి వారి నుంచి రూ.200కోట్లు కాజేసిన ఈ కుంభకోణంపై కర్ణాటక ప్రభుత్వం డీఐజీ బీఆర్ రవికాంతె గౌడ నేతృత్వంలో 11మంది సభ్యులతో సిట్ ఏర్పాటు చేసింది. బుధవారం ఐఎంఏ వ్యవస్థాపకుడు మన్సూర్‌ఖాన్‌తో సంబంధాలున్న వివిధ సంస్థలకు చెందిన ఏడుగురు డైరెక్టర్లను సిట్ అరెస్ట్ చేసింది. వారిని నిజాముద్దీన్, నసీర్ హుస్సేన్, నవీద్ అహ్మద్, అర్షద్‌ఖాన్, వాసిమ్, అన్సార్ పాషా, దాదాపీర్‌గా గుర్తించారు. ఇప్పటి వరకూ ఈ కేసుకు సంబంధించి 25వేల ఫిర్యాదులు అందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఐఎంఏ జువెల్స్ గత మూడునెలలుగా వారికి సక్రమంగా వడ్డీ చెల్లించడం లేదు.

మరోవైపు ఐఎంఏ వ్యవస్థాపకుడు మన్సూర్‌ఖాన్ కొందరు పెట్టుబడిదారులకు ఒక ఆడియోక్లిప్ పంపించి అజ్ఞాతంలోకి వెళ్లాడు. తనను కొందరు రాజకీయ నాయకులు, రౌడీలు వేధిస్తున్నారని, అందుకే ఆత్మహత్య చేసుకోదల్చుకున్నానని అందులో పేర్కొన్నాడు. ఆడియో క్లిప్‌లో ఇటీవలే కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రోషన్ బేగ్ పైన కూడా ఖాన్ సంచలన ఆరోపణలు చేశాడు. ఎమ్మెల్యే కోట్లు తీసుకుని తిరిగి ఇవ్వడంలేదని వాపోయాడు.

అయితే ఈ వ్యవహారంపై స్పందించిన బేగ్ ఆ ఆరోపణలను కొట్టిపారేశారు. ఇదంతా తనపై జరుగుతున్న కుట్ర అని బేగ్ పేర్కొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### ఏఈఎస్ మరణమృదంగం

బీహార్‌లోని ముజఫర్‌పూర్‌తోపాటు ఆ సమీపాన గల చంపారన్, వైశాలీ తదితర జిల్లాల్లో అక్యూట్ ఎన్సెఫలిటిస్ సిండ్రోమ్ (ఏఈఎస్) అనే వ్యాధి మూలంగా వందమందికి పైగా పేద బాలలు మరణించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పటికీ నాలుగువందల మందికి పైగా పిల్లలు దవాఖానల్లో విషమ పరిస్థితుల్లో ఉన్నారు. వేసవి వచ్చిందంటే చాలు పిల్లలు ఏఈఎస్ లక్షణాలతో దవాఖానలకు చేరుకోవడం ఏటా జరుగుతున్నదే. అయినా ప్రభుత్వం దీని నివారణకు చర్యలు తీసుకోకపోగా, చికిత్సకు తగిన వసతులను కూడా సమకూర్చలేదు. ఈ వ్యాధి ఎందుకొస్తుందనే విషయమై మొదట్లో అయోమయం ఉండేది. ఏఈఎస్ వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్, రసాయనిక పదార్థాలలో దేనివల్లనైనా రావచ్చు. కానీ ముజఫర్‌పూర్ జిల్లాలో ఆ పరిసరాల్లో విస్తారంగా పండే లిచీ అనే పండు మూలంగా వస్తున్నదని వెల్లడైంది. లిచీ పండు మంచిదే. కానీ పోషకాహారం లేని పిల్లలు తినడం వల్ల అందులోని ఒక పదార్థం మూలంగా చక్కెర నిలువలు తగ్గుతాయి. దీంతో ప్రాణాంతకంగా మారుతుంది. పోషకాహార లేమితో బాధపడుతున్న పిల్లలు కనీసం ఈ పండుతిన్న రోజు రాత్రి పూట భోజనం చేసినా హాని జరుగదు. ఇది వైరస్, బ్యాక్టీరియా సమస్య కాదు, పండు తెచ్చిన ప్రమాదం కాదు. పోషకాహార లోపం తెచ్చిపెట్టిన ప్రమాదం. ఈ విషయం పరిశోధనల్లోనూ వెల్లడైంది. రెండు దశాబ్దాలుగా ఎండాకాలం వచ్చిందంటే చాలు నేల మీద రాలిన ఈ పండ్లు తినడం వల్ల పేద పిల్లలు అనేకమంది మరణిస్తున్నారు. అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడమే లేదు. పైగా ఎండ దెబ్బ వల్ల మరణించారంటూ కొత్త కారణాలు వెదుకుతున్నారు. పోషకాహార లోపంలో ముజఫర్‌పూర్ జిల్లా పరిస్థితి నలభైకి పైగా ఆఫ్రికా దేశాల కన్నా అధ్వాన్నంగా ఉన్నది. ఈ పోషకాహార లోపం వల్ల, వైద్య వసతులు లేకపోవడం వల్ల యూపీ మొదలుకొని బీహార్ వరకు అనేక మంది పేద పిల్లల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రెండేండ్ల కిందటే యూపీలోని గోరఖ్‌పూర్ జిల్లాలో ఐదు వందల మంది మరణించారు. 2016 నుంచి 2018 వరకు 228 మంది జపానీస్ ఎన్సెఫలిటిస్‌కి గురయ్యారు. వీరిలో 46 మంది మరణించారు. ఏఈఎస్ కారణంగా 2000 సంవత్సరం నుంచి 2010 వరకు ఒక ముజఫర్‌పూర్ జిల్లాలోనే వెయ్యి మంది పిల్లలు మరణించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ బ్యాంకు, యూనిసెఫ్ తదితర సంస్థల గణాంకాలు పరిశీలిస్తే, మాతా శిశు పోషకాహారం విషయంలో ముజఫర్‌పూర్ జిల్లా ఆఫ్రికా దేశాల కన్నా అధ్వాన్నంగా ఉన్నది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కూడా ఇదే విష యం ధ్రువీకరించింది. ఈ జిల్లాలో ఐదేండ్లలోపు వయసు వారిలో 48 శాతం పిల్లల ఎదుగుదుల తక్కువగా ఉన్నది. 17.5 శాతం బక్కగా ఉన్నారు. 42 శాతం బరువు తక్కువగా ఉన్నా రు. ఒక్క ముజఫర్‌పూర్ మాత్రమే కాదు, మొత్తం బీహార్ రాష్ట్రం పరిస్థితి కూడా దేశంలోనే అధమంగా ఉన్నది. బీహార్‌లో పిల్లలకు పోషకాహార లోపం వల్ల ఎదుగుదల దెబ్బ తినడంతోపాటు అనేక వ్యాధులు కలుగుతున్నాయని జాతీ య కుటుంబ ఆరోగ్య సర్వే (2015-16) హెచ్చరించింది. దీనిని బట్టి పోషకాహార లోపం ఎంతగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. అయినా ఈ పోషకాహార లోపాన్ని అధిగమించడానికి తగిన ప్రయత్నాలు జరుగలేదు. ముజఫర్‌పూర్ ఘోరంపై మీడియా గగ్గోలు పెట్టగానే ముఖ్యమంత్రి నితీశ్ దవాఖానకు వెళ్ళి వచ్చారు. మరణించిన పిల్లల కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయలు చెల్లిస్తామని ప్రకటించా రు. కానీ మూల కారణమైన పోషకాహార లోపాన్ని చక్కదిద్దడానికి ప్రభుత్వం ఏమి చేయదలుచుకున్నదీ తెలువదు. పోషకాహార లోపాన్ని 2022 నాటికి నిర్మూలించాలని 2017 నాటి జాతీయ పోషకాహార వ్యూహం నిర్దేశిస్తున్నది. 2022 నాటికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అయిన సందర్భంగా చంద్రుడి మీదికి రోవర్‌ను పంపుతున్నామంటే అదొక దేశవ్యాప్త సంచలన వార్త అయింది. అది సంతోషించవలసిన విషయమే. కానీ దేశంలో పోషకాహార లోపాన్ని తీర్చాలనే నిర్ణయానికి అదే రీతిలో స్పందన లేదు. పేద పిల్లల కడుపు నిండటం అనేది ఎవరికి పట్టింపు లేని వ్యవహారం గా మారిపోయింది. ఆ నిర్ణయం సమర్థవంతంగా అమలుకావడమే లేదు. యూపీ వంటి పెద్ద రాష్ట్రంలో నలభై శాతం జిల్లాల్లో నలభై శాతం మంది పిల్లలలో ఎదుగుదల లేదంటే, ఇంతకాలం ఈ పార్టీలు, ప్రభుత్వాలు ఏమి చేస్తున్నట్టు? మాతాశిశు ఆరోగ్యం కోసం ప్రవేశ పెట్టిన పథకాలన్నీ ఏమై పోతున్నాయి? ఎందుకు ఫలితాలను ఇవ్వడం లేదనేది చర్చ సాగడమే లేదు. పోషకాహార లోపం, నిరక్షరాస్యత, పేదరికం మొదలైనవన్నీ విడిగా పరిష్కరించే సమస్యలు కాదు. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగే వ్యూహాలను అమలు చేయాలె.

## బుమ్రా యార్కర్‌కు గాయపడ్డ విజయ్ శంకర్



సౌథాంప్టన్: ప్రపంచకప్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత జట్టును గాయాల బెడద వేధిస్తోంది. ఇప్పటికే ఓపెనర్ శిఖర్ ధావన్ మెగాటోర్నీకి దూరమయ్యాడు. తాజాగా యువ ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ గాయపడ్డాడు. వర్షం కురిసినప్పటికీ కోహ్లీసేన బుధవారం సాధన చేసింది. నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తుండగా జస్ప్రీత్ బుమ్రా వేసిన యార్కర్ శంకర్ పాదాలకు బలంగా తగిలింది. అతడు నొప్పితో బాధపడ్డాడు. కాగా మరీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జట్టు వర్గాలు పేర్కొన్నాయి. అవును, విజయ్ నొప్పితో బాధపడ్డాడు. సాయంత్రానికి నొప్పి తీవ్రత తగ్గింది. భయపడాల్సినంతగా ఏమీ లేదు అని టీమిండియా వర్గాలు తెలిపాయి. నిజానికి శంకర్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేసేందుకు అవసరం అవుతాడని ఎంపిక చేశారు! అవసరాన్ని బట్టి ఏ స్థానంలోనైనా ఆడిస్తున్నారు. తన మీడియం పేస్‌తో జట్టుకు అవసరమైన సమయంలో ఉపయోగపడుతున్నాడు. పాకిస్థాన్ మ్యాచ్‌లో కీలకమైన రెండు వికెట్లు తీశాడు. అతడి యదార్థ పరిస్థితి మాత్రం ఎవరికీ తెలియదు. తొడ కండరాలు పట్టేయడంతో పేసర్ భువనేశ్వర్ విశ్రాంతి తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ధావన్ విషయంలో చేసినట్టే అతడి పురోగతిపై జట్టు గోప్యత పాటిస్తోంది. భువీకి అసలు తొడకండరాలే పట్టేశాయా లేదా కండరాల్లో చీలిక వచ్చిందా స్పష్టంగా చెప్పడం లేదు. బర్మింగ్‌హామ్‌లో జూన్ 30న ఇంగ్లాండ్‌తో జరిగే మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉంటాడని ఆశిస్తున్నారు. అతడు గనక జట్టుకు దూరమైతే ఇషాంత్ శర్మకు పిలుపు రావొచ్చు. ఎడమచేతి వాటం పేసర్ ఖలీల్ అహ్మద్ ఇంగ్లాండ్‌లోనే స్టాండ్‌బై బౌలర్‌గా ఉన్నాడు.

## ఈవీఎంలపై చర్చిస్తే వచ్చేవాళ్లం: మాయావతి

లఖ్‌నవూ (ఉత్తర్‌ప్రదేశ్): పలు అంశాలపై చర్చించడానికి దేశంలోని ప్రధాన పార్టీల అధినేతలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి పిలుపువచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొన్ని పార్టీల అధినేతలు సమావేశానికి వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. వీరిలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి కూడా ఉన్నారు. తాను ఈ సమావేశానికి హాజరుకావద్దని తీసుకున్న నిర్ణయానికి గల కారణాలపై ఆమె వివరణ ఇచ్చారు. ఒకవేళ ఈ సమావేశంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)పై చర్చ జరిగితే దీనికి హాజరయ్యేవారిమని అన్నారు. దేశంలో ఉన్న సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొస్తున్నారని ఆరోపించారు.

బ్యాలెట్ పత్రాల ద్వారా కాకుండా ఈవీఎంల ద్వారానే ఎన్నికలు నిర్వహించాలన్న మొండి పట్టుదల దేశ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ముప్పు. ఈ తీవ్ర సమస్యపై ఈ సమావేశం నిర్వహించి ఉంటే నేను తప్పకుండా దీనికి హాజరయ్యేదాన్ని. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక సమస్యగా ఉండకూడదు. అలాగే, అతి వ్యయానికి సంబంధించిన అంశంగా చూడకూడదు. ఒకే దేశం ఒకే ఎన్నిక అనే విషయం నిజానికి దేశంలో తీవ్ర సమస్యలుగా ఉన్న పేదరికం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పెరిగిపోతున్న హింస నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న ప్రయత్నం. ఒకే దేశం ఒకే ఎన్నిక అన్న విషయం ఒక భ్రమ మాత్రమే అని మాయావతి ట్విటర్‌లో పేర్కొన్నారు.

## ఆ పని చేస్తే కేసీఆర్‌ను సన్మానిస్తా: జగ్గారెడ్డి

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టును తప్పుబట్టాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. కాళేశ్వరంతో ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలు తీరతాయని చెప్పారు. ప్రాజెక్టుల నిర్మాణం ఎవరి హయాంలో జరిగినా హర్షించాల్సిందేనని వ్యాఖ్యానించారు. జగ్గారెడ్డి గాంధీభవన్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, సింగూరు, మంజీరాలను కట్టిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ఏ సీఎం ప్రాజెక్టులు నిర్మించినా ప్రజలు.. రైతుల కోసమేనని చెప్పారు.

సోనియా తెలంగాణ ఇవ్వబట్టే కాళేశ్వరం కట్టగలిగామని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఏడాదిలోనే కాల్వలు తవ్వి సింగూరు, మంజీరాలను నింపాలని.. ఈ రెండింటిని నింపితే సంగారెడ్డి ప్రజల పక్షాన సీఎం కేసీఆర్‌ను సన్మానిస్తానని ఆయన చెప్పారు. కాళేశ్వరం



ప్రారంభోత్సవానికి ఏపీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు జగన్, ఫడణవీస్‌ను ఆహ్వానించడంలో తప్పులేదన్నారు. కాళేశ్వరం అవినీతి గురించి తనకు తెలియదని.. ఆవిషయం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చూసుకుంటారని చెప్పారు.

## మా ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా లేదు



దిల్లీ: కర్ణాటకలో కాంగ్రెస-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు లేదని కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని కూలదోయడానికి భాజపా అనేక కుట్రలు పన్నుతుందోని ఆరోపించారు. అయినా వారి ప్రయత్నాలు ఫలించే అవకాశం ఏమాత్రం లేదన్నారు. రాహుల్ జన్మదినం సందర్భంగా బుధవారం దిల్లీకి చేరుకున్న సిద్ధరామయ్య ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై కూడా చర్చించినట్లు సమాచారం.

ఇటీవల ముఖ్యమంత్రి కుమారస్వామి మంత్రి విస్తరణ జరిపిన నేపథ్యంలో సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు కూటమిలోని ముఖ్య నేతలే ప్రభుత్వంపై విమర్శలు చేస్తుండడాన్ని పరోక్షంగా ఉద్దేశిస్తూ.... ఎంతో బాధతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని కుమారస్వామి వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన నేపథ్యంలో ప్రభుత్వ మనుగడపై సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## కవి సమయం

### తల్లి దండ్రులు

కనిపించని దైవానికి ప్రతిరూపం కనిపించే తల్లి దండ్రులు
ఈ ధరణిపై నడయాడే ప్రత్యక్ష దైవాలు
సర్వస్వం త్యాగం చేసి తమకున్నదంతా ధారపోసి
రక్త మాంసాలను స్వేదంగా మార్చి
పిల్లల అభ్యునతికి కృషి సల్పి
జీవన పర్యంతం త్యాగం చేసి
ప్రతిఫలమేమీ ఆశించని భగవస్వరూపులు
కలికాలం జాడ్యం వలన తల్లిదండ్రుల
కష్టాలను, త్యాగాలను గుర్తుంచుకొని
కృతజ్ఞతాభావం వుంచుకోవడం అటుంచి
కూరలో కరివేపాకు వలే
అవసరం తీరాక, రెక్కలొచ్చి ఎగిరిపోయాక
తోడూ నీడగా వుండడం మానేసి
వారి ఖర్మాన వారిని వదిలేయడం
ఎంతటి దౌర్భాగ్యం, అమానుషం
స్వార్థానికి, లోభానికి పరాకాష్ట
ధర్మ విరుద్ధం, అధర్మ వర్తనం
అధ: పాతాళానికి జీవితం కుంగిపోవడం
రౌరవాది నరక కూపాల ప్రాప్తం


కవిత రచన :
సి.ప్రతాప్

## పంచాంగం

**మేషం** : చిరు వ్యాపారులకు చికాకులు తప్పవు. బంధు మిత్రలాభం, సంతానంలో సఖ్యత, నూతన పరిచయాలు పెరుగును. బంధువుల మధ్య సయోధ్య నెలకొంటుంది.కొత్త సమస్యలు తలెత్తె అవకాశం ఉంది. మెళుకువ వహించండి. మీ మాటకు సంఘంలోనూ, కుటుంబములోనూ ఆమోదం లభిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. **వృషభం** : పనులు సక్రమంగా పూర్తికావు. పెండింగు వ్యవహారాలు పూర్తి అగును. విలువైన వస్తువులు పోగొట్టు కుంటారు. బ్యాంకు వ్యవహారాలు, ప్రయాణాల్లో మెలకువ వహించండి. **మిథునం** :వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. ఏ విషయంలోను ఇతరులపై ఆధారపడక స్వయంకృషినే నమ్ముకోవడం మంచిది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బ్యాంకు వ్యవహారాలలో పరిచయం లేని వ్యక్తులతో మితంగా సంభాషించండి. **కర్కాటకం** : ఉద్యోగులకు ఉన్నత స్థితి పొందుతారు. లాభం కలుగును. దంపతుల మధ్య సఖ్యత నెలకొంటుంది. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళు, ప్రలోభాలకు పోకుండా ఏకాగ్రతతో పని చేయవలసి ఉంటుంది. స్త్రీలకు ముఖ్యుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు. **సింహం** : ఆదాయం సమృద్ధిగా వుండును. యశోభూషణ ప్రాప్తి, అధికార లాభం కలుగును. మీ సంతానం పరీక్షల పట్ల శ్రద్ధ వహిస్తారు. ఆడిటర్లకు ఒత్తిడి, కాంట్రాక్టర్లకు లాభదాయకం. ఏ విషయంలోను నిరుత్సాహం చెందక అంతా మంచికేనని సర్దుకుపోవటం శ్రేయస్కరం. ఎల్.ఐ.సి పోస్టల్ ఏజెంట్లకు ఒత్తిడి, స్పెక్యులేషన్ రంగాల వారికి చికాకులు తప్పవు. **కన్య** : దూర ప్రయాణములు చేస్తారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. స్త్రీలతో సంభాషించునపుడు సంయ మనం పాటించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు ఏకాగ్రత ముఖ్యం. గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనాలు తలకిందులవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు **తుల** : ఏ రంగమందు ఉన్నవారికైనా బాగుం టుంది. ఖర్చులు అధికం. కాంట్రాక్టర్లకు రావలసిన ధనం అందడంతో నిర్మాణ పనులు వేగవంత మవుతాయి. ఎదుటివారితో ఎలా మాట్లాడినా తప్పుగానే భావిస్తారు. దైవ, పుణ్య కార్యాక్రమాల పట్ల చురుకుగా పాల్గొంటారు. **వృశ్చికం** : ఎదుటివారి విషయాలలో జోక్యం చేసుకోవటం వల్ల మాటపడక తప్పదు. స్త్రీలు గత కొంత కాలంగా అనుభవిస్తున్న సమస్యలు పరిష్కారం కాగలవు. పచారీ, ఫ్యాన్సీ, హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్ పనివారలకు పురోభివృద్ధి. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళకు లొంగకుండా స్థిరచిత్తంతో వ్యవహరించవలసి ఉంటుంది. **ధనుస్సు** : కొంతమంది మీ నుండి ధనసహాయం ఆశించవచ్చు. వైద్యులకు చురుకు ధనం, ఆడిటర్లకు ఒత్తిడి, లాయర్లకు కలిసివచ్చే కాలం. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేస్తారు. **మకరం** : ఉపాధ్యాయులకు ఒత్తిడి, అక్కౌంట్స్ రంగాల వారికి పనిభారం తప్పవు. స్త్రీలకు శ్రమాధిక్యత, మానసికాందోళనల వల్ల ఆరోగ్యము మందగిస్తుంది. చిన్నతరహా, కుటీర పరిశ్రమల వారికి ప్రోత్సాహకరం. బంధువుల రాకపోకలు అధిక మవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు. **కుంభం** : ఉద్యోగస్తుల తొందరపాటు చర్యలు, నిర్లక్ష్యం వల్ల కొత్త సమస్యలెదుర్కోవలసి వస్తుంది. పత్రిక రంగాల్లో వారు, రచయితలు ఆశించే మర్పులకోసం కొంత కాలం వేచియుండక తప్పదు. **మీనం** : **ఆర్థిక** లావాదేవీలు బాగుండును. విద్యార్థులకు పోటీ పరీక్షల ఏకాగ్రత, సమయపాలన అవసరం. ఖాదీ, పట్టు, చేనేత, కలంకారీ వస్త్ర వ్యాపారు లకు ఆటుపోట్లు తప్పవు. స్త్రీలు ఇతరులతో మితంగా

## ఈ పుష్కరిణిలో స్నానం చేస్తే చాలు!

## సంకీర్తన



కొలువైన పరమ పవిత్రమైన క్షేత్రాలలో 'గురువాయూర్' ఒకటి. దేవతల గురువైన బృహస్పతి .. వాయుదేవుడు కలిసి ఇక్కడ కృష్ణుడి మూర్తిని ప్రతిష్ఠించడం వలన ఈ క్షేత్రానికి ఈ పేరు వచ్చింది. ఇక్కడి 'రుద్ర తీర్థం' మహిమాన్వితమైనదిగా చెప్పబడు తోంది. ఈ తీర్థంలో స్నానం చేసినవారు వ్యాధుల నుంచి బయటపడతారనడానికి అనేక నిదర్శనాలు వున్నాయి.

తన తండ్రి 'పరీక్షిత్తు' మహారాజు 'తక్షకుడు' అనే పాము కాటు కారణంగా మరణించడంతో, ఆయన కుమారుడైన 'జనమేజయుడు' సర్పజాతి పట్ల ద్వేషంతో 'సర్పయాగం' చేశాడు. అలా అనేక సర్పాలను చంపిన పాప ఫలితంగా ఆయనకి 'కుష్ఠు వ్యాధి' సంక్రమించింది.

ఆ వ్యాధితో బాధపడుతోన్న ఆయనకి పరశురాముడు తారసపడతాడు.' 'గురువాయూర్'లోని 'రుద్ర తీర్థం'లో స్నానమాచరించమని చెబుతాడు. దాంతో ఆయన శ్రీకృష్ణుడిని ఆరాధిస్తూ అనునిత్యం ఆ తీర్థంలో స్నానమాచరిస్తూ వస్తాడు. ఫలితంగా కొంతకాలానికి అతని వ్యాధి పూర్తిగా తగ్గిపోతుంది. ఇలా ఈ తీర్థంలో స్నానమాచరించి వివిధ రకాల వ్యాధుల బారి నుంచి బయటపడినవాళ్లు ఎంతోమంది వున్నారని చరిత్ర చెబుతోంది.

### ఇక్కడి శిల్పకళ చూసి తీరవలసిందే!

ప్రాచీన క్షేత్రాలను దర్శించినప్పుడు అక్కడి శిల్పకళ అద్భుతమనిపిస్తుంది .. ఆశ్చర్యానందాలను కలిగిస్తుంది. అలా శిల్పకళతో సహా విలసిల్లే క్షేత్రాలలో ఒకటి చిత్తూరు జిల్లా 'సోంపాళ్యం'లో కనిపిస్తుంది. ఇక్కడ ఆవిర్భవించిన చెన్నకేశవస్వామికి విజయనగర రాజులు ఆలయాన్ని నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది.

సువిశాలమైన ప్రదేశంలో ఈ ఆలయం నిర్మించబడింది. పొడవైన ప్రాకారాలు .. మంటపాలు .. స్తంభాలు ఆలయ వైభవానికి అద్దం పడుతుంటాయి. గర్భాలయంలో చెన్నకేశవస్వామి .. ప్రత్యేక మందిరంలో లక్ష్మీదేవి పూజలు అందుకుంటూ వుంటారు. ఈ ఆలయంలో గోడలు .. స్తంభాలు .. మంటపాలు అన్నీకూడా అలనాటి శిల్పకళా వైభవాన్ని ఆవిష్కరిస్తుంటాయి.

పురాణ దృశ్యాలతో పాటు ప్రత్యేక శిల్పాలు ఔరా! అనిపించకమానవు. అమరశిల్పి జక్కన్న .. ఆయన శిష్య బృందం ఈ శిల్పాలను మలిచారని చెబుతారు. అందమైన ఆ శిల్పాలను వాళ్లు మలిచింది రాయితోనా .. మైనంతోనా అనే ఆశ్చర్యం కలిగేంతగా ఆ శిల్పకళ ఉంటుంది. స్వామివారి మహిమలతో పాటు .. అలనాటి శిల్పుల అద్భుతమైన శిల్పకళా చాతుర్యం కారణంగా, ఈ క్షేత్రం మరింత విశిష్టతను సంతరించుకుని కనిపిస్తుంది.



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# అతిసార వ్యాధితో ఆటలాడవద్దు

విశాఖపట్నం : అతిసార పక్షోత్సవాలలో భాగంగా గురువారం కెఆర్ఎం.కాలనీ అంగన్ వాడీ కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.సుబ్బలక్ష్మి మాట్లాడుతూ అతిసారాను అశ్రద్ధ చేయవద్దని హెచ్చరించారు. వాంతులు, విరోచనాలతో బాధపడే పిల్లలకు ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటలో ఈ పౌడర్‌ను కలిపి దఫదఫాలుగా పట్టాలని, వాటితో పాటు జింక్ మాత్రలు కూడా తీసుకోవడం ద్వారా అతిసారాను అదుపు చేయవచ్చునని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం సంజీవని, ఆశాలు, చిన్నతల్లి, పద్మ, ఉమ, రమణమ్మ, తల్లులు తదితరులు పాల్గొన్నారు.



# జోరుగా మద్యం అమ్మకాలు! ప్రశ్నించే వారిపై దాడులు చేస్తురు...

యానాం : సముద్ర తీర ప్రాంతాల సావిత్రినగర్‌లో జోరుగా, అక్రమంగా మద్యం అమ్మకాలు సాగుతున్న ఎక్సైజ్, పోలీసు శాఖాధికారులు ముడుపుల ముసుగులో చోద్యం చేస్తున్నారని ఆ గ్రామస్తులు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఒకే కుటుంబానికి చెందిన అక్క చెల్లెళ్లు అక్రమ మద్యం అమ్మకాలుపై ఆ గ్రామ ప్రజలు అధికారులకు తరచూ ఫిర్యాదులు చేసిన నామమాత్రపు దాడులు చేసి మద్యం స్వాధీనం చేసుకుని జరిమాన విధించి వదిలివేయటం పరిపాటిగా సాగుతుంది. డ్యూటీ కానిస్టేబుల్‌కు మామూళ్లు ఇవ్వడం వల్ల దీనిపై పట్టించుకోని పరిస్థితి. అలాగే పోలీసు అధికారులు నెలవారీ మామూళ్లు చెల్లిస్తూ వుంటున్నారని గ్రామస్తులు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో సావిత్రినగర్‌లో మద్యం అమ్మకం దారులు మంత్రి మల్లాడి కృష్ణారావుకు వ్యతిరేకంగా ఎస్ఆర్. కాంగ్రెస్‌పార్టీకి అనుకూలంగా పనిచేసి తిరుగుబాటు ఎగరవేశారు. దీంతో ఆ గ్రామంలో మద్యం అమ్మకాలు నిలిచిపోతాయని, వీటిని పోలీసులు, అధికారులు నియంత్రిస్తారని గ్రామస్తులు అందరూ అనుకున్నారు కాని ఆ పరిస్థితి కనిపించకపోవడంతో గ్రామస్తులు బహిరంగంగా అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 7 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు యధేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. బీరు రూ.110లు వుంటే రూ.130-150లకు, బ్రాంది రూ.80లు వుంటే రూ.110లకు అమ్మకాలు చేస్తున్నారు. సావిత్రినగర్‌లో వున్న కోపరేటివ్ బ్రాంది షాపు నుండి యానాంలో పలు బ్రాంది షాపులు నుండి కొనుగోలు చేసి మరీ అమ్మకాలు చేస్తున్నారు. ఈ అమ్మకాలను నిలుపుదల చేయాలని గ్రామస్తులు బహిరంగంగా ప్రజా ప్రతినిధులను, అధికారులను ప్రశ్నించిన నేటికి నిలుపుదల చేయకపోవడం శోచనీయం. ఈ వ్యవహారంపై పరిపాలనాధికారి శివరాజ్‌మీనా వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు.


# బాల్యవివాహాన్ని నిలుపుదల చేసిన ఐసిడిఎస్ అధికారులు



కుటుంబీకులతో మాట్లాడుతున్న ఐసిడిఎస్, పోలీసు అధికారులు

గొలుగొండ : మండలంలో చీడిగుమ్మల పంచాయతీ శివారు సిహెచ్ ఎర్రవరం గ్రామంలో గురువారం జరగనున్న బాల్య వివాహాన్ని ఐసిడిఎస్ అధికారులు, పోలీసులు నిలుపుదల చేశారు. గ్రామానికి చెందిన ఇమ్ముకుల అప్పలరాజు, రమణమ్మల దంపతుల కుమార్తెకు(16) గురువారం వివాహం జరుగుతుందని ఐసిడిఎస్ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.శ్రీకళ, గొలుగొండ ఎస్సై నారాయణరావుకు గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులను, పెండ్లి కుమార్తెకు బాల్య వివాహం వల్ల జరిగే నష్టాలను వివరించి అవగాహన కల్పించారు. పెళ్లి కుమార్తె చిడిగుమ్మల హైస్కూల్లో ప్రస్తుతం పదవ తరగతి చదువుతుంది. అధికారులు తల్లిదండ్రులతో మాట్లాడి వివాహాన్ని అమ్మాయికి 18 సంవత్సరాలు పూర్తయిన తర్వాత జరిపించడానికి ఒప్పించారు. తల్లిదండ్రుల దగ్గర నుంచి ఐసిడిఎస్ అధికారులు ఒప్పంద పత్రాన్ని తీసుకొని ప్రస్తుతం జరగబోయే వివాహం నిలుపుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఐ.సత్యవతి, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# భరత జాతికే తలమానికం యోగ విజ్ఞానం



విశాఖపట్నం : ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాత గురువులు శ్రీ శ్రీ శ్రీ ఆత్మానందమయి అమ్మగారి ద్వారా సుషుమ్న క్రియా యోగ దీక్షా కార్యక్రమం సిరిపురం లోని ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగింది. ఈ కార్యక్రమానికి అద్భుత స్పందన లభించింది. విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, ఇలా పలు ప్రాంతాల నుండి ధ్యాన సాధకులు కార్యక్రమానికి హాజరయ్యారు. మనిషి ఎంతటి శక్తిమంతుడో తెలుసుకోవాలన్నా, మానవ మేథా శక్తిని పరిపూర్ణంగా వినియోగించుకోవాలన్నా తప్పకుండా యోగ సాధన చేయాలని పూజ్యశ్రీ ఆత్మానందమయి అమ్మగారు వివరించారు. ఆధునిక సమాజంలో ఎన్నో లైఫ్ స్టైల్ ప్రాబ్లమ్స్ తో బాధపడుతోన్న వారి కోసం అందించబడిందే సుషుమ్న క్రియా యోగమని ఆత్మానందమయి అమ్మగారు తెలియచేసారు. అనారోగ్యం బారిన పడకుండా దేహాన్ని వజ్రతుల్యంగా మార్చగల విజ్ఞానమే సుషుమ్న క్రియా యోగమని చెప్పారు అమ్మగారు. ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రదేశాల్లో దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగ వాలంటీయర్లు సుషుమ్న క్రియా కార్యక్రమాల్ని యోగ డే సందర్భంగా నిర్వహించారు.



**24 వ వార్డు, బుక్కావీధి, ఒకటి, రెండు, మూడు కు చెందిన పెద్ద సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. దోమలపై యాత్ర తడి చెత్త- పొడిచెత్త అనే అంశాలపై సమావేశం జరిగింది. డ్వాక్రా మహిళలను ఉద్దేశించిఏపీడీ నాగమణి మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం కోసం చేయాల్సిన కృషి, దోమలను తరిమి కొట్టేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, తడి చెత్త పొడి చెత్త అమలు తదితర అంశాల గురించి విపులంగా ఏపీడి నాగమణి, సి డి ఓ,రాము, టీఎల్ ఎఫ్ అధ్యక్షురాలు బెహరా వెంకటరత్నం,డ్వాక్రా మహిళలకు వివరించారు. కార్యక్రమంలో అనసూర్య, నూరి, బెహరా శ్రావణి దేవి, కాత్యాయని, సుబ్బలక్ష్మి, కె.లక్ష్మి, ఎస్.లక్ష్మి, ఎం.సాయి తదితరులు పాల్గొన్నారు.**

## కట్టిన మరుగు దొడ్లకు

# తక్షణమే బిల్లులు చెల్లించాలి

## సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్

అనంతగిరి : మండలంలోని కొత్తూరు పంచాయతీ బూసిపాడు. తమలబంద గ్రామానికి 21 మందికి మరుగుదొడ్లు బిల్లులు చెల్లించాలని సిపిఎం పార్టీ డిమాండ్.. గురువారం స్థానిక సిపిఎం నాయకులు, సింగులు, క్రిష్ణ, పాయు మాట్లాడుతూ లబ్ధిదారులకు అందాల్సిన డబ్బులు పంచాయతీ సెక్రటరీ రెడ్డి స్వాహ చేశారని తెలిపారు ఒక్కో లబ్ధిదారుడకు 8000 వేల రూపాయలు ఇవ్వాలని వారు అన్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## క్రైస్తవ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా

# డాక్టర్ ఎం.అనీల్ పాల్

భీమునిపట్నం : విశాఖపట్నం జిల్లా ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా డాక్టర్ ఎం అనిల్ పాల్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా నియామక ఉత్తర్వులను సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కులిడి.సురేష్ బాబు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అద్యక్షుడు సురేష్ బాబు మాట్లాడుతూ క్రైస్తవులకు అనేక సమస్యలు ఉన్నాయని, వీటి పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తుందని అన్ని డినామినేషన్ లకు సంబంధించిన క్రైస్తవులు ఏకతాటిపైకి వచ్చినట్లయితే ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యలలు తీసుకువెళ్తే పరిష్కారం సులభతరం అవుతుందని అన్నారు. నూతనంగా నియమితులైన డాక్టర్ ఎం అనిల్ పాల్ మాట్లాడుతూ క్రైస్తవుల సమస్యల పరిష్కారమే తమ సంఘం ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్షులు ఎ.జె సాల్మన్, కొయ్య శ్రీనివాస రెడ్డి శ్యామ్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 20న పాఠశాల పునఃప్రారంభం



యానాం : పుదుచ్చేరి విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యానాంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలను ఈనెల 20వ తేదీన పునఃప్రారంభించనున్నట్లు విద్యాశాఖాధికారి సాయినాథ్ తెలిపారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రెండురోజులపాటు వాయిదా వేయాలని విద్యాశాఖ కార్యదర్శి అనర్బ, డైరెక్టరు పి.వి.రుద్రగౌడ్ ఆదేశించడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. గురువారం అన్ని పాఠశాలల్లో ప్రవేశాలు నిర్వహిస్తామన్నారు.

## మోటారు వాహనాలను స్వాధీనం చేసుకున్న

# గొల్లపాలెం పోలీసులు

యానాం : పలు దొంగతనంలో పట్టుబడిన దొంగలు ఇచ్చిన సమాచారం మేరకు యానాంలో పలు మోటారు వాహనాలను గొల్లపాలెం పోలీసులు స్వాధీనం చేసుకొని తరలించిన వైనం వెలుగు చూశాయి. స్థానిక ఫెర్రీ రోడ్డులో కోన వెంకటరత్నం కాలనీలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని పలు వాహనాలను దొంగిలించిన సతీష్ ఇచ్చిన సమాచారం మేరకు అదే కాలనీలో వుంటున్న దండు ప్రోలు రాము దగ్గర ఉన్న గతంలో 23 వేలకు సతీష్ అమ్మిన స్పెలెండర్‌ప్లస్, పివై. జిరోఫోర్ ఎ.22 90 వాహనాన్ని పోలీసులు తీసుకుని గొల్ల పాలెం పోలీసు స్టేషన్‌కు తరలించారు. దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను పోలీసు జీప్‌లో తీసుకొని వచ్చి నలుగురు పోలీసులు వాహనం స్వాధీనం చేసుకుని వెళ్ళి పోయారు. ఐజిపికి యానాం ఎస్ఐకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

**CHANGE OF NAME**

**I, MIDATHADA LELU GOWRI SANKAR SAIRAM S/o. Midathada Raju, Flat No:707, Lansum Greens, Madhavadhara, Visakhapatnam. do hereby declared that changed my old name MIDATHADA LELU GOWRI SANKAR SAI RAM to new name MIDATHADA LEELU GOWRI SHANKAR SAI RAM I request all to consider my name MIDATHADA LEELU GOWRI SHANKAR SAI RAM**

# ఘనంగా పరవాడ దుర్గమాంబ పండుగ

**భక్తులుతో కిక్కరిసిన అమ్మవారి అలయం**

**భారీ అన్నసమారాధన-భక్తులు వద్ద నుండి విశేష స్పందన**



పరవాడ: మండల కేంద్రమైన పరవాడలో గల శ్రీశ్రీశ్రీ దుర్గమాంబ అమ్మవారి పండుగ గురువారము అంగరంగ వైభవంగా జరిగింది. వేకువజామునుండే భక్తులు అందరూ అమ్మవారిని దర్శించుకోని పూజలుచేసారు. ముందుగా వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు పైలశ్రీనువాసురావు,మాజీసర్పంచ్ చుక్కరాము నాయుడు, ఎంపిటిసి సభ్యులు సిరపురపు అప్పలనాయుడు, దుర్గమాంబ అలయదర్మకర్త పైలపోతినాయుడు, పైలహరేష్, బండారు రామారావు, చల్లా కనకారావు,టివి అప్పారావు, పోతల అప్పల నాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరము మద్యహ్నాంఏర్పాటుచేసిన అన్న సమారాధనకు భక్తులు వద్దనుండి విశేషస్పందన లభించింది. చుట్టు ప్రక్కలగల గ్రామస్తులు అందరూ ఈకార్యక్రమంలో పోల్గోనీ అమ్మవారి ప్రసాదమును స్వీకరించారు. సాయంత్రము ఏ పలు సంస్కృతి కార్యక్రమాలు ప్రజలును ఏంతగానో అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దుర్గమాంబయూత్ సభ్యులు మరియు అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# మంత్రి వర్యులు అవంతికి వినతిపత్రం



భీమునిపట్నం : రాష్ట్ర ముఖ్యమంత్రి గత ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్న అమ్మఒడి పథకం అనేది ఒక మంచి ఆలోచన అయితే ఈ పథకం కేవలం ప్రభుత్వ పాటసాలలో చదువుతున్న తల్లులకు మాత్రమే వర్తింప చేసినట్టులు అయితే ప్రభుత్వ పాటసాలలు బలోపేతం అవుతాయని అలా కాకుండా ప్రైవేట్ పాటశాలకు కూడా ఈ పథకం అమలుచేసినట్లు అయితే ప్రభుత్వ పాటసాలలు నిర్వీర్యంఅయ్యే పరిస్థితి అవుతాదని ,కావున అమ్మఒడి పదకంను కేవలం ప్రభుత్వ పాటసాలలో మాత్రమే అమలు చేసే విదంగా మంత్రి వర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు కృషి జేయాలని అలాగే సిపిఎస్ రద్దు పక్రియం వేగవంతం చేసే కృషి చెయాలని పిఆర్‌టియు విశాఖ జిల్లా ప్రదాన కార్యదర్శి డి.జి.నాద్ సభ్యులు మంత్రివర్యులు కి వినతి పత్రం అంధజేసారు. భీమునిపట్నం నుండి యూనియన్ నాయకులు అర్బన్ పి.ఆర్.టి.యు అధ్యక్షులు రెడ్డిపల్లి అప్పలరాజు, అర్బన్ పి. ఆర్.టి.యు ప్రధాన కార్యదర్శి ఎమ్. రమాదేవి, రాష్ట్ర పి.ఆర్. టి.యు కార్యదర్శి రమేష్ పట్నాయక్, భీమునిపట్నం రూరల్ పి.ఆర్. టి.యు ప్రధాన కార్యదర్శి వై.రామకృష్ణ, అధ్యక్షుడు జి. పరదేశి, మురళి, ..కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తహాశీల్దార్‌కి వినతిపత్రం



భీమునిపట్నం : ఈ నెల 14.వతేదీన తగరపువలస ప్రేవేట్ మార్కెట్ లో జరిగిన అగ్గిన్ని ప్రమాదం బాధితులకు ఇంత వరకు మార్కెట్ యజమాని, ఎటువంటి సహాయ సహకారం అందించలేదని భాదితులు వైసీపీ నాయకులు కి తెలిపారు. మంత్రి వర్యులు అవంతి శ్రీనివాస్ పర్యటించి నప్పుడు భాదితులును పరామర్శించి ప్రభుత్వం సహాయం 5. వేలు రూపాయిలు అందించారు. అలాగే యజమాని కూడా ఇవ్వాలని ఆరోజు తెలిపారు.

కాని ఈ రోజు వరకు ఏ సహాయం అందలేదని బాధి తులు వైసిపి నాయుకులకు తెలుపుగా దీనిపై వైసీపీ నాయ కులు భీమిలి తహాశీల్దార్ కళ్యాణ చక్రవర్తి కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్ కరుణాకర్ రెడ్డి, జగ్గుపల్లి ప్రసాద్, జీరు వెంకటరెడ్డి, అల్లిపల్లి నర్సింగరావు, వాసుపల్లి కొండబాబు, కదిరి ఎల్లాజి, చిప్పాడ వెంకటేష్, రామ సూరప్పడు, నీలపు రామిరెడ్డి, భారతీరెడ్డి, వెంకటరావు, టి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT VISAKHAPATNAM.**
**Dispute. No. 243/2018**
**BETWEEN:**
**M/s.Kapil Chits (Kosta) Pvt. Ltd, Anakapalli Branch, Visakhapatnam ... Disputant**
**AND**
**Sri. M.Bhavani Vara Prasad & Others ...Opponents**
**OP-1: Malla Bhavani Vara Prasad, S/o. Chinna Apparao, Hindu, Aged 40 years, R/o.D.No. 3-78, Upstreet, NH-5 Road, Pisinikada (Village), Anakapalli, Visakhapatnam(Dist).**
**OP-4: Setti Suri Babu, S/o. Ammanna, Hindu, Aged 39 years, R/o. K.Munchingiputtu (Village), Beside Anganwadi Centre, Konthili(Post), Hukumpeta (Mandal), Visakhapatnam (Dist).**

**NOTICE**

Please take notice that the above named Disputant has instituted the above Dispute against for you recovery of Dispute amount with subsequent interest and costs, and the Honourable Court order notice to you through this publication. Hence you are here by Noticed to appear in the above court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above Dispute on **11-07-2019 at 11.00 A.M** in default of your appereance on that day the Dispute will be heard and determined in your absence.
**Adjournment Date : 11-07-2019**
**Sri. A.VENKATESWARA RAO, & Sri.P.SATYANARAYANA, ADVOCATES, VISAKHAPATNAM.**

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT VISAKHAPATNAM**
**Dispute. No. 244/2018**
**BETWEEN:**
**M/s.Kapil Chits (Kosta) Pvt. Ltd, Anakapalli Branch, Visakhapatnam ... Disputant**
**AND**
**Sri. B.Srinivasa Rao & Others ...Opponents**
**OP-3 : Chadaram Nagamodi Matcharaju, S/o.Apparao, Hindu, Aged 50 years, R/o. Amberupuram (Vill), Govada (Post), Chodavaram (Mandal), Visakhapatnam (Dist).**

**NOTICE**

Please take notice that the above named Disputant has instituted the above Dispute against for you recovery of Dispute amount with subsequent interest and costs, and the Honourable Court order notice to you through this publication. Hence you are here byNoticed to appear in the above court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above Dispute on **11-07-2019 at 11.00 A.M** in default of your appereance on that day the Dispute will be heard and determined in your absence.
**Adjournment Date : 11-07-2019**
**Sri. A.VENKATESWARA RAO, & Sri.P.SATYANARAYANA, ADVOCATES, VISAKHAPATNAM.**

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT VISAKHAPATNAM**
**Dispute. No. 245/2018**
**BETWEEN:**
**M/s.Kapil Chits (Kosta) Pvt. Ltd, Anakapalli Branch, Visakhapatnam ...Disputant**
**AND**
**Sri. J.Venkata Raju & Others ...Opponents**
**OP-1 : Jeelakarra Venkata Raju, S/o.Ramarao, Hindu, Aged 53 years, R/o.D.No.10-1-109 ( 3 ), Mehar Nagar, Gajuwaka, Visakhapatnam-530026.**

**NOTICE**

Please take notice that the above named Disputant has instituted the above Dispute against for you recovery of Dispute amount with subsequent interest and costs, and the Honourable Court order notice to you through this publication. Hence you are here by Noticed to appear in the above court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above Dispute on **11-07-2019 at 11.00 A.M** in default of your appereance on that day the Dispute will be heard and determined in your absence.
**Adjournment Date : 11-07-2019**
**Sri. A.VENKATESWARA RAO, & Sri.P.SATYANARAYANA, ADVOCATES, VISAKHAPATNAM.**



కమిషనర్ కలసిన కె.కె.రాజు

విశాఖ నగర పోలీస్ కమిషనర్ శ్రీ మహేష్ చంద్రలడ్డా గారిని మర్యాద పూర్వకంగా కలసిన వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు

## పాడిరైతుల కుటుంబాలకు అండగా హెరిటేజ్ డెయిరీ



అచ్యుతాపురం : పాడిరైతుల కుటుంబాలకు హెరిటేజ్ డెయిరీ అండగా ఉంటుందని అచ్యుతాపురం శాఖ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు . మండలంలో చోడపల్లి గ్రామానికి చెందిన హెరిటేజ్ డెయిరీకి పాలు పోసే పాడిరైతులు మృతి చెందడం తో వారి కుటుంబాలకు 50 వేలు రూపాయల చెక్ ను ఆయన గురవారం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ శేషు మాట్లాడుతూ గిట్టు బాటు ధర , నాణ్యమైన పశుదాణా సరఫరా చేస్తూ పాడిరైతుల అభివృద్ధికి డెయిరీ పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కె అప్పలరాజు , రామారావు ,పార్వతి ,జి అప్పలరాజు, వెంకటరమణ తదితరులు ఉన్నారు

## సత్యసాయినగర్‌లో మినీ కళ్యాణమండపం నిర్మించాలి

- సానుకూలంగా స్పందించిన మంత్రి అవంతి



విశాఖపట్నం : జి.వి.ఎం.సి. 34వ వార్డు పరిధిలోగల సత్యసాయినగర్‌లో మినీ కళ్యాణ మండపం నిర్మించాలని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ఆ ప్రాంత మహిళా సంఘం అధ్యక్షురాలు యెరుపల్లి నూకరత్నం కోరుతూ వినతిపత్రం అందజేశారు. గురువారం ఉదయం మంత్రి అవంతి శ్రీనివాసరావు నివాసంలో మంత్రిని కలిసి సత్యసాయినగర్‌లోని నిర్వాసితుల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మంచినీటి ట్యాంకర్లను, విద్యుత్‌స్తంభాలు కొత్తగా వేయించాలని నీటిఎద్దడి ఎక్కువగా ఉందని ఈ ట్యాంకర్లు ఏర్పాటు చేయడం వల్ల స్థానికులకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. మహిళల కుట్టు, ఇతర శిక్షణ శిబిరాల కోసం సామాజికభవనం నిర్మించాలని గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పలుమార్లు తమ దృష్టికి తెచ్చామని గుర్తు చేశారు. ఎన్నో కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్న సరైన ఫంక్షన్ హాల్ లేక ఇబ్బందులు పడాల్సివస్తోందని నూకరత్నం ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి అవంతి మాట్లాడుతూ స్థానికులకోసం మినీ కళ్యాణమండపం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తనపై నమ్మకంగా మరోమారు గెలిపించిన 34వ వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం మంత్రిని స్థానికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వై.మీరాసాహెబ్, పాలకొల్లు భారతి, తలారి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# సీమెన్స్ ప్రయోగశాలలు ప్రారంభం

- వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు
- విద్యార్థులకు ఉపయుక్తంగా మూడు ప్రయోగశాలలు ఏర్పాటు



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఏపీఎస్ఎస్‌డీసీ-సీమెన్స్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు ప్రయోగశాలలను ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు ఈ రోజు ఉదయం ప్రారంభించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా లిఫ్ట్, మెయింటెనెన్స్, ఆటోమోటివ్ బాడీ పెయింటింగ్, ఆటోమేటివ్ బాడి రిపేర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఏయూ ఏపీఎస్ఎస్‌డీసీ సీమెన్స్ కార్యాలయ సముదాయాన్ని సైతం వీసీ ప్రారంభించారు. ఏయూలో నెలకొల్పిన ఏయూ ఏపీఎస్ఎస్‌డీసీ సీమెన్స్ కేంద్రం ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపిఎస్-ఎస్‌డిసి ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ బి.నాగేశ్వర రావు, ఏయూ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాదరావు, రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్, ఆచార్య పి.మల్లికార్జున రావు, ఆచార్య వజీర్ మహ్మద్, డాక్టర్ ఎం.జి మాధవ బాబు, ఎలక్ట్రికల్ ఇఇ ప్రసాద రెడ్డి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## సేవా దృక్పథంతో కామ్రేడ్ తారక్ నాథ్ 15వ వర్ధంతి

యలమంచిలి : కామ్రేడ్ తారక్ నాథ్ 15వ వర్ధంతిని పురస్కరించుకుని యలమంచిలి స్టేటుబ్యాంక్ స్టాఫ్ యూనియన్ పుస్తక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. యలమంచిలి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో గల ఎంపీపీ స్కూల్ నందు, అయోధ్యపరి కాలనీలోగల మండల పరిషత్ పాఠశాల నందు మరియు ఎస్. రాయవరం మండల వమ్మవరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాల, గుర్రాజు పేట గ్రామంలోని ఉన్నత పాఠశాల నందు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది తారక్ నాథ్‌కు నివాళులు అర్పించి ఆయన స్ఫూర్తితో ప్రతి సంవత్సరం ఈ విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో సాయి, సరస్వతి, ప్రధాన్, శ్రీనివాస్, బలరాం మరియు ఇతర బ్యాంక్ యూనియన్ సిబ్బంది పాల్గొని ఆయనకు నివాళు లు అర్పించారు.

## పెను పోతు కుటుంబానికి మల్లాడి పరామర్శ

యానం : నియోజకవర్గంలోని విశ్రాంత ఉద్యోగి స్వాతంత్ర సమరయోధుడు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అగ్నికుల క్షత్రియ సంక్షేమ సేవా సంఘం మాజీ అధ్యక్షులు పెనుపోతు సూర్యనారాయణమూర్తి( 89) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని గురువారం ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు పరామర్శించారు స్థానిక తోట వారి వీధి లో గల పెనుపోతు సూర్య నారాయణ మూర్తి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు అగ్నికుల క్షత్రియ సంక్షేమ సేవా సంఘం తరపున గుర్తుండిపోయే విధంగా తాను ఏదో ఒక కార్యక్రమం చేయడానికి సిద్ధంగా ఉన్నానని అని అన్నారు అదేవిధంగా యానం శివారు ప్రాంతమైన దొమ్మేటి పేట లోని దొమ్మేటి అర్జున్ రావు అకాల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు అదేవిధంగా అదేవిధంగా సావిత్రి నగర్ తదితర ప్రాంతాల్లోని పాల్గొని పరామర్శించారు ఈ కార్యక్రమంలో లో మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్ర చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండో ఏసియన్ కోచ్ లైసెన్స్ సాధించిన సత్యనారాయణ

యలమంచిలి : జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన తైక్వాండో ఏసియా కోచ్ లైసెన్స్ కోర్సును నగిరెడ్డి సత్యనారాయణ పూర్తిచేసినట్లు న్యూ అంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పి. అచ్చుతరెడ్డి గురువారం తెలిపారు. వరల్డ్ తైక్వాండో ఏసియన్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న హైదరాబాద్‌లోని జాతీయ టూరిజం మేనేజ్‌మెంట్ భవనంలో జరిగిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో యలమంచిలికి చెందిన నగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఏసియన్ తైక్వాండో యూనియన్ అధ్యక్షులు ప్రొఫెసర్ క్యూషోక్‌లీ రెండు రోజులపాటు ఈ శిక్షణ నిర్వహించారన్నారు. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ పోటీలు జరిగిన సమయంలో మన జట్టులకు కోచ్‌గా వ్యవహరించేందుకు సత్యనారాయణ అర్హత సాధించినట్లు అచ్చుతరెడ్డి తెలిపారు. ఇకపై జాతీయ తైక్వాండో పోటీల్లో సత్యనారాయణ కోచ్‌గా వ్యవహరిస్తారన్నారు. హాలీవుడ్ నటుడు మార్షల్ ఆర్ట్స్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన బ్రూస్‌లీకి కొంతకాలం ట్రైనర్‌గా వ్యవహరించిన 80 ఏళ్ల మాస్టర్ క్యూషిక్‌లీ ఆధ్వర్యంలో సత్యనారాయణ కోచ్ లైసెన్స్ కోర్సును పూర్తిచేయడం చాలా అదృష్టమన్నారు. శిక్షణ అనంతరం టిఎఫ్ఐ ప్రతినిధులు అర్హతాపత్రాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు ఎం. అచ్చుంనాయుడు, చెరుకూరి వెంకటరమణ, అంతర్జాతీయ రిఫరీ శ్రీరంగం సంతోష్‌కుమార్, వైఎస్ఆర్ సీపీ నాయకులు మాజీ జెడ్‌పీటీసీ బొద్దపు యర్రయ్యదొర, కస్పారవికుమార్, యలమంచిలి న్యాయవాదుల బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస పట్నాయక్, యలమంచిలి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఏ. గంగాధర్ తదితరులు అభినందించారు.

## సత్యదేవుని సన్నిధిలో భక్తుడికి గాయం

అన్నవరం...... తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో గురువారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో విజయవాడకు చెందిన సత్తిబాబు అనే భక్తుడు స్వామివారి దర్శనం చేసుకొని తూర్పు రాజగోపురం ఎదురుగా గల రావిచెట్టు వద్ద ప్రదక్షిణలు గావించి స్వామివారి ప్రసాదము కొరకు మెట్ల మార్గం ద్వారా వెళ్లుతున్న సమయంలో కాలు జారి వెనుకకు పడిపోవడంతో తలకు బలమైన గాయం తగలడంతో అక్కడ దగ్గరలో పిఆర్వో ఆఫీసు వద్ద ఉన్న లింగంపల్లి.సత్యనారాయణ అక్కడకు చేరుకొని స్థానిక దేవస్థానం ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యము కొరకు 108 వాహనము ద్వారా తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

యలమంచిలి, యలమంచిలి మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్కో ఏఈ వెంకటరావు తెలిపారు. విద్యుత్తు లైనులో మరమ్మత్తులు ఇందుకుగాను 33/11 కె.వి. విద్యుత్ ఉపకేంద్రంలో ఎల్.పి.డి.ఎస్ అభివృద్ధి పనులు నిమిత్తం ఉదయం 09:00 గంటల నుండి 01:00 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కారణంగా రామనగర్, యర్రవరం, మిలిటరీ కొలనీ, గాంధీనగర్, ఎల్.ఐ.సి ఆఫీస్, కొత్తపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది అన్నారు. దేనికి ప్రజలు సహకరించాలని కోరారు.

# హామీలన్నీ అమలు పరుస్తాం

మొదటి పేజీ తరువాయి

కోరారు. గురువారం కలక్టరేట్ సమావేశ మందిరంలో పలు నియోజక వర్గాల శాసన సభ్యులతో కలసి ఆయన శాఖల వారీగా ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించారు. జి.వి.ఎం.సి., వి.ఎం.అర్.డి.ఏ., ఐ.టి.డి.ఏ. తదితర సంస్థలు అమలు చేసే పథకాలతో పాటు త్రాగునీరు, వైద్య, ఆరోగ్యం, వ్యవసాయం, నీటిపారుదల, పౌర సరఫరాలు, ఎక్సైజ్, స్త్రీ, శిశు సంక్షేమం, పంచాయితీరాజ్, జాతీయ రహదారులు తదితర అంశాలను సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి ప్రజలు అఖండ మద్దతును ఇచ్చారని, ప్రజల అశలు, ఆశయాలకు అనుగుణంగా తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అన్నింటినీ క్షేత్ర స్థాయిలో పటిష్టంగా అమలు పర్చేందుకు ఇప్పటికే శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.2 లక్షల కోట్ల లోటు బడ్జెట్ సమస్యను ఎదుర్కొంటున్నప్పటికీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అన్నింటినీ అమలు పర్చాలనే చిత్తశుద్ధితో ప్రభుత్వం ఉందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలను అన్నింటినీ జిల్లాలో పటిష్టంగా అమలు పర్చేందుకు జిల్లా యంత్రాంగం, అధికారుల అంతా సన్నద్ధంకావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ కష్టపడి పనిచేసే అధికారులను, ఉద్యోగులను ప్రోత్సహిస్తామన్నారు. పార్టీలకు, రాగ ద్వేషాలకు అతీతంగా అంకిత భావంతో విధులు నిర్వహించే వారికి అండగా ఉంటామని, విధులపై అలక్ష్యాన్ని ప్రదర్శిస్తూ అవినీతి, లంచగొండి తనానికి పాల్పడే అధికారులను ఉపేక్షించేది లేదని ఆయన హచ్చరించారు. జిల్లాలో మూడు రకాలైన బౌగోలిక పరిస్థితులు ఉన్నాయని, వాటికి అనుగుణంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. భారత రాజ్యాంగ నిర్మాణ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా జిల్లాలో సమసమాజ, నవ సమాజ స్థాపనకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

### జి.వి.ఎం.సి... తీరుపై సమీక్ష

జి.వి.ఎం.సి. పథకాల అమలు తీరును మంత్రి సమీక్షిస్తూ నగర పరిధిలో కాలుష్యం, వేడి వాతావరణం రోజురోజుకి పెరిగిపోతున్నాయని, వాటి నియంత్రణకు మొక్కలను పెద్ద ఎత్తున పెంచేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు పర్చాలని జి.వి.ఎం.సి. కమిషనర్ ఎం.హరినారాయణన్ సూచించారు. పట్టణ ప్రణాళిక విభాగం నియమ నిబంధనలకు విరుద్ధంగా పలు భవనాల నిర్మాణానికి అనుమతులు జారీ చేయడం వల్ల పలు సమస్యలు తలెత్తుతున్నాయని, అందుకు బాధ్యులు అయిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టీల్ ప్లాంట్, పోర్టు తదితర ప్రభుత్వ రంగ సంస్థలు జి.వి.ఎం.సి.కి చెల్లించాల్సిన పన్ను బకాయల జాబితాను తమకు అందజేస్తే, సంబంధిత శాఖల కేంద్ర, రాష్ట్ర మంత్రులతోను, ఉన్నతాధికారులను మాట్లాడి పన్ను బకాయిలు వసూలు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పార్లమెంట్ సభ్యులు విజయసాయిరెడ్డి జి.వి.ఎం.సి.కి అందజేసిన వాటర్ ట్యాంకర్లను వెంటనే వినియోగంలోకి తేవాలన్నారు. యు.సి.డి. విభాగం అధికారులు అడ్డగోలుగా మంజూరు చేసిన గృహాల విషయంలో సమగ్ర విచారణ జరిపి తగు నివేదికను అందజేయాలని ఆజేశించారు. జి.వి.ఎం.సి.పథకాలను మరింత సుదీర్ఘంగా సమీక్షించేందుకు త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని జి.వి.ఎం.సి.కమిషనర్ ను మంత్రి ఆదేశించారు.

### ట్రైబల్ యూనివర్శిటీ ఏర్పాటుకు చర్యలు

ఐ.టి.డి.ఏ. పథకాల అమలు తీరును మంత్రి సమీక్షిస్తూ ఏజన్సీ ప్రాంతంలో ఎటు వంటి ఆరోగ్య సమస్యలు, మరణాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐ.టి.డి.ఏ. ప్రాజక్టు అధికారి డి. కె.బాలాజీని, అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని మంత్రి ఆదేశించారు. ఏజన్సీ ప్రాంతంలోని ఆసుపత్రులో వైద్యుల కొరత లేదని, అయితే ప్రత్యేక వైద్యుల కొరత ఉందని పి.ఓ. మంత్రి దృష్టికి తేగా, ఈ అంశంపై ఆరోగ్య శాఖ మంత్రితో చర్చించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఈ మధ్యకాంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ట్రైబల్ యూనివర్సిటీని, మెడికల్ కళాశాలను జిల్లాలోని ఏజన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారన్నారు. అందుకు అనువైన స్థలాన్ని పాడేరులో గుర్తించాలని సూచించారు. నర్సీపట్నం, మాడుగుల శాసన సభ్యులు చేసిన విజ్ఞప్తికి మంత్రి స్పందిస్తూ ఆయా నియోజక వర్గాల్లోని గిరిజనులకు ఐ.టి.డి.ఏ. పథకాలు వర్తింపచేసే విషయాన్ని పరిశీలించాలని పి.ఓ.ను ఆదేశించారు. తదుపరి నిర్వహించబోయే ఐ.టి.డి.ఏ. సర్వసభ్య సమావేశంలో తాను కూడా పాల్గొంటాని మంత్రి తెలిపారు.

### తాగునీటి సమస్య లేకుండా చూడండి

జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం పథకాల అమలు తీరును మంత్రి సమీక్షిస్తూ జిల్లాలో ఎటు వంటి త్రాగునీటి సమస్య లేకుండా పటిష్టమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించి అమలు పర్చాలని ఆర్ .డబ్ల్యు.ఎస్. సూపరింటెండెంట్ ఇంజనీరను ఆదేశించారు. సమ్మర్ కంటింజన్సీ ప్లాన్ క్రింద మంజూరు చేసిన రూ.3.78 కోట్లను వెచ్చించే విషయంలో అలక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఎస్.ఇ.పై మంత్రి ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. స్వయంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న భీమిలి నియోజక వర్గం పరిధిలోని పద్మనాభం ప్రాంతంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఇప్పటి వరకూ ఎటు వంటి చర్య తీసుకోలేదని మంత్రి అసంతృప్తిని వ్యక్తంచేశారు. అన్ని నియోజక వర్గాల శాసన సభ్యులతో సంప్రదించి నియోజక వర్గాల వారీగా కార్యాచరణ ప్రణాళికలను రూపొదించుకొని పటిష్టంగా అమలు పర్చాలని ఎస్.ఇ.ని మంత్రి ఆదేశించారు. భీమిలి మున్సిపాల్టీలో కూడా ఫిల్టరేషన్ కాకుండా త్రాగునీటి సరఫరా జరుగుచున్నదని ఈ సమస్యను కూడా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అమ్మ ఒడిపై విస్తృత ప్రచారం కల్పించాలి

విద్యా శాఖ పనితీరును మంత్రి సమీక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయబోయే అమ్మ ఒడి పథకం క్రింద ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థికి ప్రభుత్వం అందజేసే రూ.15,000/-లపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి స్పందిస్తూ నీరుచెట్టు కార్యక్రమం క్రింద పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, ఆ పనులకు సంబందించి పెండింగ్ లో ఉన్న రూ.30 కోట్ల విలువైన బిల్లులను నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఈ పనులకు సంబందించి సమగ్రమైన నివేదికను అందజేయాలని సూచించారు.

### దేవాదాయశాఖలో నామినేటెడ్ చైర్మన్ పోస్టులు రద్దు చేయాలి

దేవాదాయ మరియు ధర్మాదాయ శాఖ పథకాల అమలు తీరును మంత్రి సమీక్షిస్తూ అన్ని దేవాలయాల నామినేటెడ్ చైర్మన్ పోస్టులను రద్దుపర్చామని మంత్రి తెలిపారు. సింహాచల స్వామి వారి దర్శనానికి విచ్చేసే భక్తులకు వసతి సౌకర్యాలు మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# నర్సీపట్నం సమస్యలు తీర్చండి



నర్సీపట్నం : గురువారం విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పర్యాటకశాఖా మంత్రి అవంతి శ్రీనివాసరావు, కలెక్టర్ రివ్యూలో నర్సీపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకరగణేష్ పాల్గని నర్సీపట్నం నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో విత్తనాలు కొరత లేకుండా చూడాలని కోరామన్నారు. నాలుగు మండలాల్లో అంగన్వాడీ భవనాలు నిర్మించాలని, మంచినీటి సమస్య నాలుగు మండలాల్లో లేకుండా చూడాలని మంత్రి, కలెక్టర్ సమావేశంలో కోరినట్లు తెలిపారు. నర్సీపట్నంలో 10వేల మంది తూర్పు కాపులు ఉన్నారని, గత ప్రభుత్వం వారికి ఎటువంటి సర్టిఫికేట్లు మంజూరు చేయలేదన్నారు. వారందరికి బిసిడి సర్టిఫికేట్లు మంజూరు చేయాలని కోరామన్నారు. నర్సీపట్నంలో సుమారు 10వేలకు పైగా గిరిజనులు ఉన్నారని వారికి మైదాన ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందటం లేదన్నారు. కావున వారి కోసం ప్రత్యేకంగా మినీ ఐటిడిఏ ఏర్పాటు చేయాలని కోరామని చెప్పారు. నియోజకవర్గ నాలుగు మండలాల్లో బెల్టుషాపులు లేకుండా నిర్మూలించాలన్నారు. మద్యంను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని కోరామన్నారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో 150 పడకలు ఉండగా డాక్టర్లు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. కావున డాక్టర్లు, సిబ్బంది భర్తి చేయాలని కోరామన్నారు.

## 'కాన్వెంట్లకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు'

కొత్తగూడెం : ఆటపాటలతో కూడిన విద్యనందిస్తూ ప్రైవేటు కాన్వెంట్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సాగు తుందని జిల్లా సంక్షేమ అధికారి శారద అభిప్రాయ పడ్డారు. లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సామూహిక అక్షరా భ్యాసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. పిల్లలకు పాటలు, కథలు, సృజ నాత్మకతతో కూడిన శాస్త్రీయ పరిజ్ఞానం ద్వారా చిన్నారులకు విద్యనందిస్తున్నట్లు తెలిపారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలను తల్లిదండ్రులు అంగన్ వాడీ కేంద్రా లకు పంపించాలని సూచించారు.

# యోగా యొక్క చరిత్ర మరియు కలిగే ప్రయోజనాలు





**యోగా అనే సంస్కృత భాషకు చెందిన పదం.**
**యోగా ద్వారా ఆధ్యాత్మిక ప్రయోజనాలు కాకుండా, వ్యాధులు కూడా తగ్గించబడతాయి.**
**యోగాసనాల ద్వారా అధిక రక్త పీడనం నియంత్రించబడుతుంది.**
**మధుమేహ వ్యాధి గ్రస్తులలో యోగా వలన రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రించబడతాయి.**

యోగా అనే సంస్కృత భాషకు చెందిన పదం, యోగా అనగా ఐక్యం (ఏకం) అని అర్థం. ఐక్యం అనే పదానికి చాలానే నానార్థాలు ఉన్నాయి, కానీ యోగా వైద్య శాస్త్ర ప్రకారం, "మనసుతో శరీరాన్ని మిళితం చెందించి చివరకి ఆత్మకు చేరువ అవ్వటం". ధ్యానం వంటి లేదా కొన్ని ఇతర నైతిక పద్దతులను అనుసరించి మరియు సాంఘీక విధుల ద్వారా మీ అహాన్ని దూరం చేసుకునే ప్రాచీన, ఆధ్యాత్మిక పద్ధతులుగా చెప్పవచ్చు. ఈ పద్దతులు ప్రాచీనం అయినప్పటికీ, జ్ఞానులు వీటి చరిత్ర గురించి గ్రంథములలో రాస్తూ, దీని ఉనికిని ప్రపంచానికి చాటారు. రెండు వేల సంవత్సరాల క్రితం బ్రతికి ఉన్న, ప్రాచుర్యం పొందిన మునులు యోగా మరియు వాటి గురించిన ప్రాముఖ్యతల గురించి ముందే గ్రంథములలో రాసి పొందుపరిచారు.

### యోగా చరిత్ర

భారతదేశంలో వివిధ శాఖలకు చెందిన జ్ఞానులు యోగాసనాలను సాధన చేసి, మరియు యోగా వలన కలిగే ప్రయోజనాలు వాటి ప్రాముఖ్యతల గురించి ప్రచారం చేసారు. కానీ, వీరు ఆవిష్కరించిన సాధనల మరియు ప్రచారం గురించి ఎక్కడ పొందుపరచబడలేదు. ఇవి వారి శిష్యుల ద్వారా ప్రాచుర్యంలోకి తీసుకురాబడ్డాయి. మొదటిసారి పొందుపరచిన లెక్కల ప్రకారం, సేజ్ అనే పతంజలి పుణ్య పురుషుడికి ఈ ఘనత దక్కింది. ఇతడు, యోగా గురించి కొన్ని సూత్రాలను మరియు తత్వాలను (వేదాలను) రచించి, నిపుణుల ద్వారా ప్రాచుర్యంలోకి తీసుకు వచ్చాడు.

యోగాసనాలను నేర్పించే అనేక పాఠశాలలు ఉన్నాయి, అయినప్పటికీ, పతంజలి పుణ్య పురుషులు రచించిన ప్రాథమిక సూత్రాల ద్వారా మాత్రమె యోగాసనాలను అనుసరిస్తున్నారు. బౌద్ధమతం, జైనమతం మరియు శైవమతాలతో పాటుగా యోగా కూడా ఒక సంప్రాదాయ పద్దతిగా వెలిసింది.

### యోగా వలన కలిగే ప్రయోజనాలు

యోగా వలన ఆధ్యాత్మిక ప్రయోజనాలు మాత్రమె కాకుండా, కింద పేర్కొనబడిన వ్యాధులకు కూడా శక్తివంతంగా తగ్గించి వేస్తాయి.

### అధిక రక్త పీడనం


వివిధ రకాల మందులను వాడటం కన్నా, యోగాసనాలను రోజు అనుసరించటం వలన ఒత్తిడితో పాటూ రక్త పీడనం కూడా తగ్గుతుందని చాలా రకాల పరిశోధనలలో నిరూపించబడింది. రక్త పీడనం ప్రారంభమయ్యే దశలలో, రోజు యోగాను అనుసరించటం వలన వాటి స్థాయిలు తగ్గించబడతాయి. యోగా అనుసరణ వలన శరీరంలో సిరలు విశ్రాంతి చెందించబడి, వాటికి బలం చేకుర్చి, రక్త పీడన స్థాయిలు తగ్గించబడతాయి. కావున రోజు యోగాను అనుసరించటం ప్రారంభించండి.

### మధుమేహం

మధుమేహ వ్యాధి గ్రస్తులు యోగాసనాలను అనుసరించటం వలన మంచి ఫలితాలను పొందుతారు. రోజు ఉదయానే యోగాసనాలను చేయటం ద్వారా, శరీర రక్తంలో ఉండే గ్లూకోస్ (చక్కెర) స్థాయిలు తగ్గించబడతాయి. వీటితో పాటుగా ఆహార ప్రణాలికలను పాటించటం మంచిది.

### గుండె ఆరోగ్యం

యోగాసనాలను రోజు అనుసరించటం వలన, గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పరిశోధనలలో వెల్లడించబడింది. హృదయ స్పందనలు రక్త పీడనంతో నేరుగా సంబంధాన్ని కలిగి ఉంటాయి. యోగా వలన హృదయ స్పందన రేటు, రక్త పీడనం, రక్తంలో చక్కెర స్థాయిలు ఆరోగ్యకర స్థాయిలో



నిర్వహించబడతాయి.

### ఇతర ప్రయోజనాలు

యోగా వలన చాలా రకాల ప్రయోజనాలను పొందవచ్చు, ముఖ్యంగా శక్తి స్థాయిలు పెరగటం, జ్ఞాపక శక్తిలో మెరుగుదల, వయసు మీరిన కొలది జరిగే మార్పులు ఆలస్యంగా బహిర్గతం అవటం మరియు వెన్నునొప్పి సమస్యల నుండి ఉపశమనం, ఇస్నోమ్నియా, కీల్లనొప్పుల నుండి ఉపశమనం మరియు ఆస్తమా వంటి

# దర్శకులు నటులైతే..



సందీప్‌కిషన్, అన్యాసింగ్ జంటగా నటిస్తున్న చిత్రం నిను వీడని నీడను నేనే. కార్తిక్ రాజు దర్శకుడు. దయా పన్నెం, వీజీ సుబ్రహ్మణ్యన్‌తో కలిసి సందీప్‌కిషన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 12న విడుదలకానుంది. ఈసినిమాలో దర్శకులు వీఐ ఆనంద్, కార్తిక్ నరేన్‌తో పాటు హీరోయిన్ మాళవిక నాయర్ అతిథి పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ తన అస్తిత్వం కోసం పోరాడే ఓ యువకుడి కథ ఇది. హారర్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందిస్తున్నాం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి.

స్టయిలిస్ట్ నీరజ కోన రాసిన నీను వీడని నీడను నేనే పాటకు మంచి స్పందన లభిస్తున్నది అని తెలిపారు. పోసాని కృష్ణమురళి, మురళీశర్మ, వెన్నెలకిషోర్ కీలక పాత్రలను పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్. తమన్, ఛాయాగ్రహణం: ప్రమోద్‌వర్మ.

# పవన్ కల్యాణ్ లేటేస్ట్ లుక్ వైరల్..



టాలీవుడ్‌లో పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ స్టామినా ఏంటో కొత్తగా చెప్పనక్కర్లేదు. గత రెండేళ్లకుపైగా టాలీవుడ్‌కు దూరమై జనసేన పార్టీ కోసం ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టాడు. గత అసెంబ్లీ ఎన్నికల కోసం అవిశ్రాంతంగా ప్రచారం చేశాడు. ఆ క్రమంలోనే భారీగా గడ్డం, జుట్టు పెంచి రుషి అవతారం ఎత్తాడు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పవన్ కల్యాణ్ రెగ్యులర్ లుక్‌లోకి మారిపోయాడు. దాంతో పవర్ స్టార్‌పై మళ్లీ రూమర్లు జోరందుకొన్నాయి. గడ్డం తీయడం వెనుక అసలు కథేమిటంటే.. పవన్ కల్యాణ్‌కు సంబంధించిన తాజా ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. రఫ్‌గా కొంచెం గడ్డంతో కనిపిస్తూ తన కూతురు స్కూల్ డ్రస్‌లో ఉండగా ఫోటో దిగాడు. ఆ ఫోటో ఇప్పుడు మీడియాలో క్రేజీగా మారింది. ఇక ఆ ఫోటో గురించి వివరాలు పక్కన పెట్టి అసలు మ్యాటర్‌లోకి వస్తే.. పవన్ మళ్లీ సినిమాల్లోకి వస్తున్నాడంటూ ప్రచారం జోరుగా జరుగుతున్నది. రాజకీయాల్లోకి వెళ్లిన పవన్ కల్యాణ్‌కు గట్టిగానే చేదు అనుభవం ఎదురైంది. తన అభిమానులు రాజకీయాల్లో కూడా సపోర్ట్ చేస్తారనుకొంటే వాళ్లు చేతులెత్తేయడం షాక్ తగిలింది. ఇప్పుడు పవన్ పాలిటిక్స్‌కే పరిమితం అవుతాడా లేక రెండు పడవ మీద కాలు పెట్టి వచ్చే ఎన్నికల వరకు సినిమాలు, రాజకీయాలు చేస్తారా అనే విషయం అంతుపట్టకుండా ఉంది.

# చిత్రభాను

# ఆ్రరెడీ 'ఓ బేబీ' సినిమా చూశారు...

సమంత ప్రధాన పాత్రలో నందినీ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఓ బేబీ'. గురువారం ఉదయం విడుదలైన ఈ మూవీ ట్రైలర్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. హీరోయిన్ సమంత 70 ఏళ్ల వృద్ధురాలిగా, 24 ఏళ్ల పడుచు పిల్లలా నటించడం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది.

ఈ ట్రైలర్‌పై పలువురు సినీ సెలబ్రిటీలు స్పందించారు. ట్రైలర్ అద్భుతంగా ఉందని, సమంత పెర్ఫార్మెన్స్ అదరగొట్టింది అంటూ ప్రశంసలు గుప్పిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావుతో పాటు నాగార్జున, నాగ చైతన్య మరికొందరు సెలబ్రిటీలకు ఈ సినిమా ఇప్పటికే ప్రత్యేక షో వేసి చూపించారు. ట్రైలర్ రిలీజ్ సందర్భంగా వారు ఈ సినిమాపై అభిప్రాయం వెల్లడించారు. "ఓ బేబే సినిమా చూసాను. సినిమా చాలా కొత్తగా ఎమోషనల్ గా ఉంది. సమంత 70 ఏళ్ళ బామ్మగా చేసింది అనడం కన్నా 70 ఏళ్ళ అనుభవం ఉన్న నటి గా చేసింది. ఈ సినిమా తనకి ఇంకా పెద్ద పేరు తీసుకొస్తుంది." అని రాఘవేంద్రరావు ట్వీట్ చేశారు.




# ఆద్యంతం ఆసక్తికరంగా



తనిష్క్‌రెడ్డి, ఎలక్సియస్ జంటగా నటిస్తున్న చిత్రం దర్పణం. రామకృష్ణ వెంప దర్శకుడు.శ్రీనంద ఆర్ట్స్ పతాకంపై క్రాంతి కిరణ్ వెల్లంకి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. చివరి నిమిషం వరకు ఏం జరుగుతోందని ఉత్కంఠతో ఎదురు చూసేలా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ఏ విషయంలో రాజీపడకుండా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందనే నమ్మకముందిఅన్నారు. నిర్మాత మాట్లాడుతూ కొత్త పంథాలో సాగే క్రైమ్ థ్రిల్లర్ ఎంటర్‌టైనర్ ఇది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి చిత్రాన్ని వచ్చే నెల ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని, ఎడిటింగ్: సత్య గిడుతూరి.

# ఫస్ట్ ర్యాంక్ రాజు విడుదల






విశాఖపట్నం : ఫస్ట్ ర్యాంక్ రాజు తెలుగు చలన చిత్రం జూన్ 21న విడుదల సందర్భంగా పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం ఛాప్టర్ ఛైర్మన్ పి.ఎల్.కె.మూర్తి ఫస్ట్ ర్యాంక్ బ్రాండెడ్ పెన్ గురువారం విడుదల చేసారు. వివిధ కళాశాలలో ఈ పెన్నులను విధ్యార్థులకు ఉచితంగా బహుకరిస్తారు. ఈ చలనచిత్రం ముఖ్యంగా విద్యార్థుల చదువు, వివిధ ర్యాంకులు మరియు వారి జీవిత విధానంమీద కన్నడంలో సూపర్ హిట్ అయిన ఈ చిత్రాన్ని తెలుగులో విశాఖ నగర వాసి చేతన్ మద్దినేని హీరోగా చిత్రీకరించడం జరిగింది. ఈ చిత్రానికి డైరెక్టర్‌గా నరేష్ కుమార్ (కన్నడ), నిర్మాతగా మంజునాధ (కన్నడ) వ్యవహరించారు. ఈ చిత్రం కన్నడలో శత దినోత్సవం జరుపుకొని రేపు గీతా ఫలిమ్ డిస్టిబ్యూటర్ ద్వారా సుమారు 150 థియేటర్లలో రెండు తెలుగు రాష్ట్రాలలో విడుదల కాబోతుంది.

ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులందరూ తప్పకుండా ఈ చలన చిత్రాన్ని వీక్షించవలసినదిగా కోరడమైనది.



# రాజ్యాంగ విలువలను గౌరవించాలి

- స్పీకర్ పదవితో మరింత బాధ్యత
- ప్రభుత్వ లక్ష్యాలు అందరికీ అందాలి
- ఉత్తరాంధ్రకు సముచిత స్థానం కల్పించిన సీఎం

**విశాఖ విమానాశ్రయంలో స్పీకర్ తమ్మినేనికి ఘనస్వాగతం**



విశాఖ సిటీ : శాసనసభలో అందరు సభ్యులూ రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ, బాధ్యతతో మెలగాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తెలియజేశారు. శాసనసభా స్పీకర్‌గా ఎన్నికైన తరువాత మొట్టమొదటిసారి తన సొంత జిల్లా శ్రీకాకుళం వెళ్లేందుకు గురువారం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో స్పీకర్ తమ్మినేని సీతారాంకు పలువురు అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి గజమాలలు, పూలవర్షాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు.

అనంతరం స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ హౌస్‌లో కొత్త పాత, స్వపక్ష ప్రతిపక్ష తేడా లేకుండా అందరూ మాట్లాడేందుకు అవకాశం ఇచ్చి రాజ్యాంగ విలువలను కాపాడతానని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలియజేశారు. స్పీకర్ పదవితో మరింత బాధ్యత పెరిగిందని, ఈ పదవిని స్వీకరించడం ఒక సవాల్ అని ఆయన అభిప్రాయపడ్డారు.

ముఖ్యంగా ప్రభుత్వ లక్ష్యాలను అట్టడుగు వర్గాల వారందరికీ అందించేందుకు నాయకులు కృషి చేయాలని అన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రాంత, కుల వివక్ష లేకుండా అన్ని వర్గాల వారికీ సముచిత స్థానం కల్పిస్తూ ముఖ్యంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు సముచిత స్థానం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం భారీ ర్యాలీగా బయలు దేరి ఈస్ట్ పాయింట్ కాలనీలో ఉన్న సాయిబాబా గుడికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయ పూజారులు శాస్త్రోక్తంగా స్పీకర్ తమ్మినేని సీతారాంకు వేదమంత్రాలతో ఆశీర్వదించారు.



ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతిగా(స్పీకర్)తమ్మినేని సీతారాం ప్రమాణస్వీకారం చేసి గురువారం తొలిసారిగా విశాఖపట్నం విచ్చేసిన సందర్భంగా ఉత్తర నియోజకవర్గ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కె కె రాజు విశాఖ విమానాశ్రయం లో ఆయనకు ఘనస్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సనపల చంద్రమౌళి, బగాధి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విశాఖ విమానాశ్రయంలో ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు గజమాల వేసి స్వాగతం పలుకుతున్న ప్రముఖ వైద్యుడు, పద్మశ్రీ డా. కూటికుప్పల సూర్యారావు



ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఈస్ట్ పాయింట్ కాలనీ సాయిబాబా ఆలయానికి విచ్చేసిన సందర్భంగా విశాఖ నగర వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆలయం వద్ద ఘన స్వాగతం పలికారు. బాబా గుడిలో ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

## పీఎం మోదీ విత్ యంపీ యంవీవీ సెల్ఫీ టైమ్



ఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొని, సెల్ఫీ దిగిన విశాఖపట్నం యంపీ యంవివి సత్యనారాయణ.

నేను సైతం..

## యోగా సాధనలో అత్యంత పొట్టి మహిళ

ముంబై: ప్రపంచవ్యాప్తంగా జూన్ 21న ఐదవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ యోగాను సాధన చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నేను సైతం అంటూ.. ప్రపంచంలోనే అత్యంత పొట్టి (62.8 సెం.మీ) మహిళగా గిన్నిస్ రికార్డు నెలకొల్పిన జ్యోతి ఆమ్గే (25) గురువారం యోగా సాధన చేశారు. నాగ్‌పూర్‌లోని ఓ పార్కులో ఏర్పాటు చేసిన యోగా సాధన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే యోగా ప్రచార కార్యక్రమంలో జ్యోతి ఆమ్గే ఉత్సాహంగా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కాగా.. నరేంద్ర మోదీ ప్రతిపాదన మేరకు జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. దీంతో 2015 నుంచి ప్రపంచ దేశాలు జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ: మంత్రి మల్లాడి



యానాం : విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పాఠ్య పుస్తకాలను గురువారం పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు విద్యార్థులకు పంపిణీ చేశారు స్థానిక రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల లోని విద్య శాఖ ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేయడం జరుగుతుందని విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఇష్టపడి చదవాలని అన్నారు అనంతరం విద్యార్థులకు విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి శివరాజ్ మీన ,విద్య శాఖ అధికారి కాలి సాయినాథ్ ,ముమ్మిడి చిన్నారి, ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ మూర్తి, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## కాకినాడలో తెదేపా నేతల రహస్య భేటీ

- టీడీపీని వీడేది లేదంటూ స్పష్టీకరణ
- భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు
- కమలమా? ఫ్యానా? ఎందులో చేరాలి

కాకినాడ: తెదేపాకు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, నేతలు రహస్యంగా భేటీ అయ్యారు. కాకినాడ రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ హోటల్‌లో సమావేశమైనట్లు తెలుస్తోంది. తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం మాజీ ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు నేతృత్వంలో ఈ భేటీ కొనసాగుతోంది. ఈ సమావేశానికి కాపు సామాజిక వర్గానికి చెందిన 14 మంది తెదేపా నేతలు హాజరయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై ఈ భేటీలో నిర్ణయం తీసుకునే అవకాశముంది. తెదేపాను వీడి భాజపా లేదా వైకాపాలో చేరే విషయమై వీరంతా సమాలోచనలు జరుపుతున్నట్లు సమాచారం. నేతలు బూరగడ్డ వేదవ్యాస్, బొండా ఉమ, బడేటి బుజ్జి, కదిరి బాబూరావు, చెంగల్రాయుడు, బండారు మాధవనాయుడు, జ్యోతుల నెహ్రూ, వరుపుల రాజా, మీసాల గీత, కేఏ నాయుడు, పంచకర్ల రమేశ్‌బాబు, ఈలి నాని ఈ సమావేశానికి హాజరయ్యారు. మరోవైపు తాము తెదేపాను వీడేది లేదని తోట త్రిమూర్తులు, జ్యోతుల నెహ్రూ స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓటమికి గల కారణాలపైనే తామంతా విశ్లేషించామని చెప్పారు.

## హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర బస్సు ప్రమాదం

*25 మంది మృతి, 35 మందికి గాయాలు*

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర బస్సు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళుతున్న బస్సు లోయలో పడింది. ఈ ఘటనలో 25 మంది మృతిచెందారు. మరో 35 మంది తీవ్రంగా గాయపడ్డారు. కులు జిల్లా బంజర్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనా స్థలిలో సహాయక చర్యల కొనసాగుతున్నాయి.

చదవండి.. చదివించండి
విజయభాను

## టీడీపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా యువనేత !



అమరావతి: తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామ్మోహన్నాయుడిని నియమించనున్నారు. కొద్దిరోజుల్లో ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా కిమిడి కళా వెంకట్రావు కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నుంచి పోటీ చేసిన ఆయన ఓటమి పాలయ్యారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఆయన కుమారుడు నారా లోకేష్ అన్నీ తామై వ్యవహరించడంతో రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న వెంకట్రావు ప్రేక్షక పాత్ర పోషించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో బీసీ వర్గానికి చెందిన రామ్మోహన్‌నాయుడిని అధ్యక్షుడిగా నియమిస్తే బాగుంటుందని చంద్రబాబు భావిస్తున్నారు. కాగా, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి రామ్మోహన్‌నాయుడు 6,653 ఓట్ల మెజారిటీతో గెలిచిన సంగతి తెలిసిందే. టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎల్ రమణ కొనసాగుతున్నారు.




## ఇలాంటి సంక్షోభాలు పార్టీకి కొత్తకాదు

### కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దు : చంద్రబాబు



అమరావతి: పార్టీకి ఇలాంటి సంక్షోభాలు కొత్త కాదని, కార్యకర్తలెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న ఆయన తెదేపాలో నలుగురు రాజ్యసభ సభ్యులు పార్టీ మారుతున్నారని మీడియాలో వస్తోన్న వార్తల నేపథ్యంలో సీనియర్ నేతలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రత్యేక హోదా, రాష్ట్ర ప్రయోజనాల కోసమే తెదేపా భాజపాతో పోరాడిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. భాజపా ఇలాంటి చర్యలకు పాల్పడటాన్ని చంద్రబాబు తీవ్రంగా ఖండించారు.

## సీఎం జగన్ అధ్యక్షతన 24న కలెక్టర్ల సదస్సు

*నవరత్నాల అమలే ప్రధాన అజెండా*

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 24న కలెక్టర్ల సదస్సు జరగనుంది. ఎన్నికల్లో ప్రకటించిన నవరత్నాల అమలే ప్రధాన అజెండాగా కలెక్టర్ల సదస్సు జరగనుంది. కలెక్టర్ల సదస్సులో నవరత్నాల అమలుపై సీఎం జగన్ చర్చించనున్నారు. రైతుల పథకాలు, ఆరోగ్య బీమా, విద్యార్థులకు భారీ ఫీజు రీయింబర్స్‌మెంట్స్, పేద ప్రజలు ఇళ్ల నిర్మాణాలతోపాటు మరికొన్ని కీలక అంశాలపై చర్చించనున్నారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com